www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 273 | గురువారం | 27 మార్చి, 2025

# కుప్పకూలిన ఆరంతస్థుల భవనం





## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఘోర ప్రమాదం

## ఆరుగురు మృతి.. పలువురికి గాయాలు

- శిథిలాల్లో మరో వ్యక్తి ఉన్నట్టు గుర్తింపు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- జీ ప్లస్-2 పర్మిషన్ తీసుకొని భారీగా నిర్మాణం
- పోస్టుమార్టం కోసం మృతదేహాల తరలింపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భద్రాచలంలోని సలీం టీ స్టాల్ ముందు కాలనీలో నిర్మాణంలో ఉన్న 6 అంతస్థుల భవనం ఒక్కసారిగా ఆకస్మాత్తుగా కూలడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. పలువురికి గాయాలు అయ్యాయి. ప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. శ్రీపతి శ్రీను అనే వ్యక్తి జీ ప్లస్-2 భవన నిర్మాణం కోసం పర్మిషన్ తీసుకని ఐదంతస్తులు కడుతున్నారు. అక్రమ నిర్మాణాన్ని ఆపేయాలని మునిసిపల్ అధికారులు ఇచ్చిన నోటీసులను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణం చేపట్టారు. దీంతో ఈ ఘోరం జరిగిందనే ఆరోపిస్తున్నారు స్థానికులు

02





## ఏప్రిల్ 4వ వారంలో ఇంటర్ ఫలితాలు

- ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయం
- ప్రారంభమైన మూల్యాంకనం

02

# బెట్టింగ్ యాప్స్‌పై సిట్

- ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం
- శాంతిభద్రతలపై కొందరు అడ్డగోలు వ్యాఖ్యలు
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

## వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు

**ప్రజానావ, హైదరాబాద్:** బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల నిషేధానికి సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల యాప్స్ వల్ల జరుగుతున్న అనర్థాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. అందుకే తమ ఏడాదికి పైగా పాలనలో ఎలాంటి ఘటనలు లేవని చెప్పారు. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వీటిని నిరోధించడానికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం సిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. మన పరిధిలో విచారణ జరిపిస్తే సమస్యకు సరైన పరిష్కారం దొరదన్నారు. ఈ కేసులో శిక్షపడేలా ప్రత్యేక చట్టం చేస్తామని కూడా అన్నారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల ఎంతోమంది బలైపోతున్నారని సీఎం రేవంత్ ఆవేదన

మిగతా 2 లో



## బీఆర్ఎస్ బాటలో మేం నడవడం లేదు

- తెలంగాణలో ఎలాంటి ఉప ఎన్నికలు రావు
- బీఆర్ఎస్ ప్రచారంపై సీఎం ఘాటు వ్యాఖ్యలు
- సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్, ఎంఐఎం ఆందోళన
- సీఎం వ్యాఖ్యలకు వివరణ ఇచ్చిన మంత్రులు

02



## కేటీఆర్‌పై రెండు కేసులు

02

- పదో తరగతి మాస్ కాపీయింగ్ ట్వీట్‌పై ఫిర్యాదులు



## పూజారి సాయికృష్ణకు జీవితఖైదు

- రంగారెడ్డి కోర్టు తీర్పు
- సాక్ష్యాల తారుమారుకు మరో ఏడేండ్లు

04



- కమీషన్ లేనిదే పనులు కావడం లేదంటూ కేటీఆర్ ఆరోపణలు
- నిరూపించకపోతే.. క్షమాపణలు చెప్పాలని భట్టి డిమాండ్
- అసెంబ్లీలో మాటల యుద్ధం

02

# కేటీఆర్ వర్సెస్ భట్టి

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగుతున్నాయి.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ కేటీఆర్ కామెంట్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యల పట్ల భట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్లు తీసుకుంటున్నట్టు నిరూపించాలంటూ సవాల్ చేశారు. నిరూపించలేకపోతే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ భట్టి హెచ్చరించారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# బెట్టింగ్, గేమ్ యాప్ నిషేధానికి సిట్

మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. నేరం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతోందన్నారు. గుట్కా నిషేదం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ చేసిన వాళ్లను విచారిస్తే సరిపోదు.. బెట్టింగ్ యాప్ నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు ఉండాలన్నారు. మమ్మల్ని చంపుతారని కోర్టులో పిటిషన్ వేసినా వామనర్ రావు దంపతుల ప్రాణాలు దక్కలేదన్నారు. వామన్ రావు హత్య ఆరోపణలు ఎదుర్కొన్న వాళ్లను తప్పించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గంజాయి మత్తులో సింగరేణి కాలనీలో ఆరేళ్ళ చిన్నారిని దారుణంగా హత్య చేశారని చెప్పారు. శాంతి భద్రతలపై కొందరు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని సిఎం మండిపడ్డారు. పెట్టుబడుదారులకు రక్షణ కల్పించినప్పుడే పెట్టుబడులొస్తాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రం దివాళా తీస్తేనే మంచిదనేటట్లు కొంతమంది వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తాము వచ్చిన తర్వాత ఏక్కడైన గొడవలు జరిగాయా? అని రేవంత్ ప్రశ్నించారు. ఈ క్రమంలో జూదాల పట్ల కఠినంగా ఉండాలని అనుకుంటున్నామని అన్నారు. ఆన్ లైన్ బెట్టింగ్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. విమర్శల జోలికి పోను.. ఆన్‌లైన్ రమ్మి.. బెట్టింగులపై కఠినంగా ఉంటామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. వచ్చే సమావేశాల్లో ఆ÷-లనైన్ బెట్టింగులుపై



చట్ట సవరణ చేస్తామన్నారు. గుట్కా నిషేధిత పదార్థాలు మార్కెట్లో కి వచ్చాయి. వీటిపై కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసే వారిని పిలిచి విచారిస్తున్నాము. దానితో పరిష్కారం కాదు. బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తున్న వారు.. బాధ్యులను కూడా విచారించాలన్నారు. దీనికోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీ-ం వేస్తున్నాం. ప్రకటనలు చేసినా.. నిర్వహణలో భాగస్వామ్యం ఉన్న.. కఠినంగా వ్యవహారం ఉంటుందని సభలో సిఎం రేవంత్ ప్రకటించారు. నేరాలు చెప్పి జరగవు. నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటుంది ప్రభుత్వం. న్యాయవాదుల హత్య.. వెటర్నరీ డాక్టర్ హత్యలు గతంలో చూశాం. నడి బజారులో న్యాయవాదులను చంపిన వారిపై సీబీఐ విచారణకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సుప్రీం కోర్టుకు చెప్పినట్లు వెల్లడించారు. ఆరేళ్ల అమ్మాయిని సైదాబాద్ లో చంపితే అనాడు సర్కార్ పట్టించుకోలేదు. జూబ్లీహిల్స్‌లో బాలిక రేప్ కేసు.. దాంట్లో బీఆర్ఎస్ నాయకుడు ముద్దాయి. మాజీమంత్రి కొడుకుపై ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఘటనల్లోని బాధితుల పట్ల సానుభూతితో ఉండాలి. కానీ ప్రతిపక్షం.. ప్రభుత్వమే చేయిస్తుంది అన్నట్టు మాట్లాడు తున్నారు అని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఇకపోతే ధరల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కడుపునిండా విషం పెట్టుకొని ఎందుకు మాట్లాడుతారని ఘాటుగా స్పందించారు. గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరని అన్నారు. ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి.. మీరు కోరుకున్నంతమాత్రాన ఇప్పుడే రావు. భారాస ముఖ్యనేతలు ఇద్దరు పోటీపడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది. నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటాను. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా సహకరిస్తాను. పద్మారావు వచ్చారు.. కొన్ని నియోజకవర్గ పనులు అడిగారు. అక్కడికక్కడే ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నాను అని సీఎం పేర్కొన్నారు. మాకు తరతమ భేదాలు లేవని, పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు.

# బీఆర్ఎస్ బాటలో మేం నడవడం లేదు

- బీఆర్ఎస్ ప్రచారంపై సీఎం ఘాటు వ్యాఖ్యలు
- సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్, ఎంఐఎం ఆందోళన

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. పార్టీ ఫిరాయింపులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం సుప్రీంకోర్టులో ఉందని.. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడుతారని ప్రతిపక్ష బీఆర్ఎస్, ఎంఐఎం సభలో ఆందోళనకు దిగాయి. స్పీకర్ పోడియం ఎదుట బీఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. కోర్టు పరిధిలో ఉన్న ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంపై సీఎం సభలో ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. వెంటనే కలగజేసుకున్న మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపక్షాల నిరసనలను తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి కోర్టు తీర్పు గురించి మాట్లాడలేదని.. కేవలం ఫిరాయింపుల విషయంలో గతంలో మాదిరిగానే వ్యవహరిస్తామని అన్నారని వివరణ ఇచ్చారు. సీఎం మాట్లాడిన దాంట్లో తప్పేమి లేదని.. ఉప ఎన్నికలు వస్తాయని బయట బీఆర్ఎస్ నాయకులు చేస్తోన్న బెదిరింపుల గురించి మాత్రమే మాట్లారని శ్రీధర్ బాబు స్పష్టత ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్లో కూడా ఇలాంటి అంశంపై చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. జ్యుడిషియరిని విమర్శించే హక్కు పార్లమెంట్‌లో కూడా ఉంటుందని అన్నారు. మంత్రుల వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్, ఎంఐఎం ఎమ్మెల్యేలు నిరసన కొనసాగించారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. అంతకుముందు సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఎలాంటి సంప్రదాయం ఉందో అదే సంప్రదాయాన్ని మేం ఫాలో అవుతున్నాం అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ మంత్రి పదవులు ఇచ్చింది. మేం ఎలాంటి పదవులు ఇవ్వడం లేదు. వాళ్ల అడుగుజాడల్లో మేం నడవడం లేదు. ప్రతి రోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. ఫిరాయింపుల అంశం కోర్టు పరిధిలో ఉంది. తెలంగాణలో ఎలాంటి ఉప ఎన్నికలు రావు. ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా దృష్టి ఉప ఎన్నికలపై లేదు.. అభివృద్ధిపైనే ఉందని అన్నారు. ఉపఎన్నికలు రావని ఖరాఖండిగా ప్రకటించిన సీఎం, అసెంబ్లీ సభ్యులు ఎవరూ ఈ విషయంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఉపఎన్నికలపై ఊహాగానాలు చేస్తున్నవారికి సమాధానం ఇస్తూ, ఇలాంటి అంశాలపై కాకుండా ప్రజా సమస్యలపై దృష్టిపెట్టడం మేలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇతర పార్టీ నేతలు తమ పార్టీలోకి వచ్చినా, మళ్లీ వెనక్కి వెళ్లినా, వాటితో సంబంధం లేకుండా ఉపఎన్నికలు జరిగే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ అభివృద్ధి తన ప్రాధాన్యత అని స్పష్టం చేసిన సీఎం, ఉపఎన్నికల గురించి చర్చించేందుకు తన సమయం వృథా చేసుకోవడం లేదు అని చెప్పారు. ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున, తీర్పు వచ్చిన తర్వాత తాము దానిని స్వీకరిస్తామని చెప్పారు. ఇక, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీలోకి చేరడం, ఆ వ్యవహారం హైకోర్ట్, సుప్రీంకోర్టుకు వెళ్లడం, త్వరలో కోర్టు తీర్పు రాబోతుందన్న వార్తలతో తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. వీరు రాజీనామా చేసి ఉపఎన్నికలకు వెళ్లాల్సి వస్తుందని ఊహాగానాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి దీనిపై స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలోకి చేరిన బీఆర్ఎస్ నేతలు కొంత ఊపిరి పీల్చుకునే పరిస్థితి వచ్చింది. రాష్ట్ర రాజకీయాల్లో కొనసాగుతున్న అనిశ్చితి పట్ల ఆయన చేసిన ప్రకటనతో ఉపఎన్నికలపై వదంతులకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి.

# కేటీఆర్ వర్సెస్ భట్టి

**కమీషన్ లేనిదే పనులు కావడం లేదంటూ కేటీఆర్ ఆరోపణలు**

**నిరూపించకపోతే.. క్షమాపణలు చెప్పాలని భట్టి డిమాండ్**



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగింది. పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ అసెంబ్లీ వేదికగా కేటీఆర్ కామెంట్ చేశారు. అయితే.. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు నిరూపించాలంటూ కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు. నిరూపించలేకపోతే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ భట్టి హెచ్చరించారు. దోచుకుంది మీరు.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది మీరే అంటూ బీఆర్ఎస్ నేతలపై భట్టి మండిపడ్డారు. కాగా.. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యుల ఆందోళన నేపథ్యంలో.. కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు. ధరణి, భూ భారతిపై కూడా తెలంగాణ అసెంబ్లీలో రచ్చ జరిగింది. ధరణిపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇంకా అదే చట్టాన్ని అమలుచేస్తున్నారు. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ పథకాల అమలు జరుగుతుందని.. పైగా ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతిలో అనేక లోపాలు ఉన్నాయన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. ఈ వ్యాఖ్యల పట్ల అధికార పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ధరణి ఓ దుర్మార్గమైన చట్టమంటూ డిప్యూటీ సీఎం భట్టి మండిపడ్డారు. పార్ట్-బీ పేరుతో భూములు దోచుకున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉద్యమాలతో వచ్చిన చట్టాలను ఒక్క కలంపోటుతో వెనక్కు తీసుకెళ్లారు. ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఎన్నికల్లో చెప్పాం .. చెప్పినట్టుగానే భూ భారతిని తీసుకొచ్చామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.


# కుప్పకూలిన ఆరంతస్థుల భవనం

- శిథిలాలు తొలగిస్తే మృతదేహాలపై స్పష్టత

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. భద్రాచలం పంచాయతీ ఆఫీసు దగ్గర నిర్మాణంలో ఉన్న ఓ ఆరంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. భవనంలో పని చేస్తున్న కార్మికుల్లో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది.. ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. జేసీబీలతో శిథిలాలను తొలగిస్తున్నారు. మృతదేహాలను వెలికితీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఇంటి యజమాని శ్రీపతి శ్రీనివాస్ రావు పారిపోయాడు. ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. ఇంటి యజమాని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్థుల భవనం ఒక్కసారిగా నేలమట్టం అయ్యింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారని అనుమానిస్తున్నారు. వెంటనే పోలీసులు బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. భవనం కింద చిక్కుకుని పలువురు మృతి చెందినట్లు సమాచారం. భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో ఆరంతస్తుల మేర స్లాబ్ నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఈ భవనం బుధవారం మధ్యాహ్నం హఠాత్తుగా కుప్పకూలింది. భవనం కూలిపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పాత భవనంపైనే మరో నాలుగు అంతస్తులు నిర్మిస్తుండగా ప్రమాదం జరిగింది. నిర్మాణంలో లోపాల వల్లే ఘటన జరిగినట్టు అధికారులు భావిస్తున్నారు. నిర్వాహకులు ట్రస్ట్ పేరుతో విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఐటీసీ నుంచి క్రేన్లు, పొక్లెయిన్లు రప్పిస్తున్నారు. కూలిన భవనం పక్కనే ఓ ఆలయం కూడా నిర్మిస్తున్నారు. నాశిరకం నిర్మాణం చేయడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుందని అంటున్నారు. ఓ పాతభవనంపై మరో నాలుగు అంతస్థులు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. గత ఏడాది పంచాయతీ సిబ్బంది నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించడంతో అప్పటి నుంచి నిర్మాణం నిలిచిపోయింది. ఒకవేళ భవనం ప్రారంభోత్సవమై భక్తులు ఉండి ఉంటే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేదని ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం పనులు జరుగుతున్న సమయంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే భవన యజమాని భార్య చెబుతున్న ప్రకారం.. ఇద్దరు కూలీలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శిథిలాల కింద ఎంతమంది



ఉన్నాడనేది తొలగింపు తరవాత బయటపడనుంది. నిర్మాణంలో నాణ్యత లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు.



# ఏప్రిల్ 4వ వారంలో ఇంటర్‌ఫలితాలు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల పరీక్షలు మంగళవారం (మార్చి 25)తో ముగిశాయి. ప్రధాన సబ్జెక్టు పరీక్షలు మార్చి 20వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే జవాబుపత్రాల మూల్యాంకనం కూడా ప్రారంభమైంది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభమవగా మార్చి 25తో అన్ని పరీక్షలు ముగిశాయి. తొలుత కొన్ని ప్రశ్నపత్రాల్లో తప్పులు దొర్లడంతో హల్‌చల్ చేసినా ఆ తర్వాత సజావుగానే పరీక్షలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9,96,971 విద్యార్థులు పరీక్షలు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలు రాశారు. వీరిలో ఫస్టియర్‌లో విద్యార్థులు 4,88,448 మంది, సెకండియర్ విద్యార్థులు 5,08,523 మంది ఉన్నారు. ఇక గతంలో ఫెయిలైన విద్యార్థులు 67,735 మంది కూడా ఈసారి పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 1,532 పరీక్ష కేంద్రాల్లో అక్కడక్కడా కొందరు విద్యార్థులు కాపీ కొడుతూ డీబార్ అయినప్పటికీ సింహభాగం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 19 సెంటర్లల్లో నిర్వహిస్తున్నారు. మార్చి 19 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగనుంది. మూల్యాంకనం అనంతరం ఇంటర్ పరీక్షల ఫలితాలను ఏప్రిల్ నెలాఖరులోపు విడుదల చేసే లక్ష్యంతో అధికారులున్నారు. ఏప్రిల్ 29వ తేదీ నుంచి ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందువల్ల ఆ పరీక్ష ప్రారంభానికి కనీసం రెండు మూడు రోజుల ముందుగానే ఫలితాలు వెల్లడించాలని ఇంటర్ బోర్డు భావిస్తుంది. అంటే ఏప్రిల్ నాలుగో వారంలో ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉంది. గతేడాది మార్చి 19వ తేదీకి పరీక్షలన్నీ పూర్తికాగా, ఏప్రిల్ 24న ఫలితాలు విడుదల చేశారు. ఈసారి కూడా ఏప్రిల్ చివరి వారంలో ఫలితాలు వెల్లడించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# కేటీఆర్‌పై రెండు కేసులు

**ప్రజానావ, హైదరాబాద్:** పది పరీక్షలో మాస్ కాపీయింగ్ నిందితులతో మున్సిపల్ చైర్మన్‌కు సంబంధాలు ఉన్నాయంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. దీంతో కేటీఆర్ ట్వీట్‌పై నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత, శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు అయ్యాయి. కాంగ్రెస్ నాయకుడు ఉగ్గడి శ్రీనివాస్ కూడా సోషల్ మీడియాపై ఫిర్యాదు చేశారు. కాగా.. ఈనెల 21న నకిరేకల్‌లో టెన్త్ ఎగ్జామ్ పేపర్ లీకేజ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే తెలుగు ప్రశ్నాపత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. నల్గొండ జిల్లా నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలోని 8వ నెంబర్ గది నుంచి తెలుగు ప్రశ్నాపత్రం లీకైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై వేగంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పేపర్ లీకేజీకి బాధ్యులైన చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించగా.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇన్విజిలేటర్‌ను కూడా సస్పెండ్ చేశారు. అంతే కాకుండా ప్రశ్నపత్రం లీకేజ్ అవడానికి ఓ విద్యార్థిని కారణం అంటూ ఆమెను డిబార్ చేశారు.

# 14 ఏళ్లలో తగ్గిన నక్సల్స్ హింస

**న్యూఢిల్లీ:** గడచిన 14 ఏళ్లలో దేశంలో నక్సల్ హింస 81 శాతం తగ్గిందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ బుధవారం రాజ్యసభకు తెలిపింది. 2010 నుండి 1,936 సంఘటనలతో గరిష్టస్థాయిలో ఉందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రారు నేడు రాజ్యసభలో మాట్లాడుతూ.. 2024లో నక్సల్ వయెలెన్స్ సంఖ్య 374కి తగ్గిందని అన్నారు. పౌరులు, భద్రతా దళాలు మరణాల సంఖ్య 2010లో 1,005గా ఉంటే.. 2024కి 150కి తగ్గింది. అంటే 85 శాతం తగ్గుదల ఉంది అని ఆయన అన్నారు. కాగా, నక్సల్ హింస కేసులు 2023లో 485, 2022 : 413, 2021 : 361, 2020 : 470, 2010 : 501 నమోదయ్యాయి.

# సీఎంను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే

**కూకట్‌పల్లి సమస్యలపై ప్రస్తావన.. నిధుల విడుదలకు వినతి**



**ప్రజానావ, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డిని కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలిశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీల ఛాంబర్లో సీఎం రేవంత్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నూతన రోడ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి నూతన పైప్ లైన్ ల నిర్మాణం, పార్కులు, శ్మశాన వాటికల నిర్మాణం పనులకు) సుమారుగా రూ. 25-30 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా కూకట్‌పల్లి మండలం పరిధిలోని హైదర్‌నగర్ గ్రామం సర్వే నెంబర్ 145,163 లలో నిర్మాణ అనుమతులను నిలిపివేసి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దశాబ్దాల కాలంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా గానీ ప్రభుత్వపరమైన అన్ని అనుమతులను జారీ చేశార చెప్పారు. ఇటీ-వల కాలంలో అకస్మాత్తుగా నిర్మాణ అనుమతులను నిలిపివేశారని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా జేఎన్టీయూ వెనుక ఉన్న సాయినగర్ కాలనీ వాసుల ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. 2014 కు ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు డబ్బులు చెల్లించేందుకు కాలనీ వాసులు సిద్ధంగా ఉన్నారని వారికి న్యాయం చేయాలని కోరారు. అన్ని విషయాలను వివరంగా తెలుసుకున్న సీఎం రేవంత్ వినతి పత్రాలను సంబంధిత అధికారులకు పంపిస్తానని త్వరలోనే పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
గురువారం
27 మార్చి 2025


# పదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- ఆనాడు మాకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు
- రేవంత్ మంచోడు కాబట్టే.. మీరు మాట్లాడుతున్నారు
- అసెంబ్లీలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఘాటు విమర్శలు



**ప్రజానావ, హైదరాబాద్:** అధికారంలో ఉన్న పదేళ్లు బీఆర్ఎస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఆనాడు విపక్ష సభ్యులను కనీసం మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. అంతేగాకుండా విపక్షమే లేకుండా చేయాలని కుట్ర చేశారని మండిపడ్డారు. తెలంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టే బీఆర్ఎస్ నేతలు ఇంకా ప్రశాంతంగా ఫామ్ హౌజ్‌లో ఉన్నారని లేదంటే.. నిన్నటి దాకా ఒక లెక్క ఇప్పటి నుంచి ఒక లెక్క అనేలా పరిస్థితి ఉండేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో 8 వేల హత్యలు.. లక్ష దొంగతనాలు జరిగాయని.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన అహంకారంతో సాగిందని.. తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన అధికార దుర్వినియోగానికి ఉదాహరణ అని అన్నారు.పోలీస్ అధికారులు కూడా బీఆర్ఎస్ అధికార దాహానికి బలయ్యారని.. బీఆర్ఎస్ పెద్దలు చెప్పిన అందరి ఫోన్లు ట్యాప్ చేసి ఇప్పుడు ఇబ్బందుల్లో చిక్కుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ చేయించిన పాపాలతో పోలీసులు విదేశాలకు పారిపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పోలీసు వ్యవస్థను దారుణంగా వాడుకుందని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ పీసీసీ పదవిని రూ. 50 కోట్లకు కొన్నడని కోమటి రెడ్డి అన్నాడని కెటిఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై కోమటి రెడ్డ రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం లేకుండా చేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు మాకు నీతులు చెప్తున్నారని ఎద్దేవ చేశారు. ఎన్నో తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. మీకు నాయకుడే లేడు.. సభకు రావడమే మానేశారని తెలిపారు. ప్రజల సమస్యలు చెప్పడానికి సభకే రావడం లేదు. రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టి మీరు ఇంకా ఫామ్ హౌస్ లో ప్రశాంతంగా ఉన్నారు. లేకుంటే నిన్నటి నుంచి ఒకలెక్కా.. ఇవాల్టి నుంచి ఇంకో లెక్క అన్నట్టు ఉండేది. సైరన్ సప్పుడు లెకుండా తిరుగుతున్నారు కాబట్టి వాళ్ళు అంత పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ లీడర్లు అందరి ఫోన్లు ట్యాప్ చేసి అధికార దాహానికి బలై పోయారు. అహంకారంతో సాగింది బీఆర్ఎస్ పాలన.. మేము ఆరుగురం ఉన్నప్పుడు మా గొంతు నొక్కారు. సభ మీ సొంతమా అని అడిగారు. ఇప్పుడు నేను అడుగుతున్న.. సభ మీ సొంతమా మరి.. వచ్చినప్పటి నుండి ఒకటే గొడవ.. మీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.. ఆ టైమ్ ప్రజల కోసం కేటాయిస్తే చాలు అని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు.

# తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్

- శాంతిభద్రతల విషయంలో రాజీలేదు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగా వ్యవహరించడం లేదు
- శాంతిభద్రతలపై చర్చలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**ప్రజానావ, హైదరాబాద్:**శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శాంతి భద్రతలు కాపాడేందుకు చాలా మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మతపరమైన ఉద్రిక్త పరిస్థితులకు తెలంగాణలో అవకాశం లేదని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం శాంతి భద్రతలపై చర్చ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ పోలీసులు రూ.185 కోట్లు బాధితులకు వాపస్ ఇచ్చారు.. ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ రికవరీ చేయలేదని తెలిపారు. ఆనాడు కేసులను నమోదు చేయకుండా బాధితులను భయపెట్టించారు.. కానీ ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఏంటో మేం చేతల్లో చూపించామని అన్నారు. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మిస్తున్నామని.. రంగారెడ్డి జిల్లా మంచిరేవులో ఈ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీసుల పిల్లలకు విద్యను అందిస్తామని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ పోలీసులు స్వేచ్ఛగా కేసులు నమోదు చేస్తున్నారని.. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతల చెప్తేనే కేసులు నమోదయ్యాయని ఆరోపించారు. మంథనిలో అడ్వకేట్ దంపతుల మర్డర్ జరిగితే.. ఈ ఘటనలో పోలీసులు ఎలా వ్యవహరించిన తీరు అందరి చూశారని విమర్శించారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ఇప్పుడు క్యూఆర్‌కోడ్ ఏర్పాటు చేశామని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన టీజీ న్యాబ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కొత్త పోస్టులు మంజూరు చేశామని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించుకుని పోలీసులు కేసులు వేగంగా పరిష్కరిస్తున్నారని కొనియాడారు. సైబర్ నేరాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నామని.. సైబర్ సెక్యూరిటీ యావత్ దేశం సమస్య అని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని.. ఏఐ బేస్డ్ ట్రాఫిక్ మానిటరింగ్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ట్రాఫిక్‌కు సంబంధించి అదనపు సిబ్బందిని నియమించామని గూగుల్ మ్యాప్ ఉపయోగించుకుని ట్రాఫిక్ నియంత్రణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇతర మెట్రో సిటీలతో పోల్చితే.. మన ట్రాఫిక్ నియంత్రణ బాగుందని అన్నారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలను మరింత పటిష్టం చేస్తున్నామని అన్నారు.

# మాజీ సర్పంచ్ హత్య కేసులో నిర్లక్ష్యం

**సూర్యాపేట డీఎస్పీ రవిపై వేటు**

**ప్రజానావ, సూర్యాపేట:** సూర్యపేట డీఎస్పీ రవిపై వేటు పడింది. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాలలో ఇటీవల జరిగిన గ్రామ మాజీ సర్పంచి మెంచు చక్రయ్య గౌడ్ మర్డర్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పోలీస్ ఉన్నతాధికారులు డీఎస్పీపై చర్యలు తీసుకున్నారు. ఆయనను డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఐజీ సత్యానారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నిర్లక్ష్యం వహించిన తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ ను బదిలీ చేయగా ఎస్ఐకి మెమో జారీ చేశారు. సూర్యాపేట ఇన్ చార్జ్ డీఎస్పీగా కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. మార్చి 17 న సూర్యాపేట జిల్లాలో మాజీ సర్పంచ్ మెన్చు చక్రయ్యను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మెన్చు చక్రయ్య మార్చి 21న ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి వస్తూ గ్రామ శివారులోని ముత్యాలమ్మ గుడి వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ చక్రయ్య కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలానికి చేరుకొని చక్రయ్యను సూర్యాపేట హాస్పిటల్‌కు తరలించగా ట్రీట్‌మెంట్ తీసుకుంటూ చనిపోయాడు.మాజీ సర్పంచ్ చక్రయ్యగౌడ్ హత్య కేసును త్వరలో ఛేదిస్తామని, దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని మల్టీజోన్ -2 ఐజీ సత్యనారాయణ హెచ్చరించారు.

# అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు నొక్కేస్తున్నారు

- సభా నిబంధనలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి ప్రకటన
- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై జడ్జిమెంట్ ఎలా ఇస్తారు?
- అందుకే సభనుంచి వాకౌట్ చేశామన్న హరీశ్‌రావు



**ప్రజానావ, హైదరాబాద్:** పార్టీ మారిన ఎమ్మెల్యేలు వాపస్ పోతారనీ డౌట్ వచ్చిందేమో.. అందుకే ఉప ఎన్నికలు రావని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడాడని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ చేశారు. సుప్రీంకోర్టులో పెండింగులో ఉన్న పార్టీ ఫిరాయింపుల విషయమై నిబంధనలకు విరుద్ధంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. ముఖ్యమంత్రి సభలో మాట్లాడింది పూర్తిగా అసెంబ్లీ పార్లమెంట్ వ్యవస్థకు విరుద్ధం. కోర్టులో పెండింగులో ఉన్న విషయాలను చట్టసభల్లో మాట్లాడకూడదని పార్లమెంటరీ ప్రొసీజర్ బుక్‌లో స్పష్టంగా ఉంది. కోర్టు పరిధిని అధిగమించి ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉన్నా కూడా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఈ విషయంపై జడ్జిమెంట్ ఇచ్చాడు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు డిస్ క్వాలిఫై కారు, ఉప ఎన్నికలు రానే రావు అని జడ్జిమెంట్ ఇచ్చారు. ముఖ్యమంత్రి తన పరిధిని దాటి సుప్రీంకోర్టులో ఉన్న విషయం మీద మాట్లాడడం అసెంబ్లీ ప్రివిలేజ్ కిందకే వస్తుంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అందుకే తాము సభలో అభ్యంతరం చెప్పామని, నిరసనగా వాకౌట్ చేశామని అన్నారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ కింద నేను చెప్పే ప్రయత్నం చేస్తే మధ్యలో నా మైక్ కట్ చేశారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశాం. సలహాలు ఇవ్వాలంటే ఇవ్వచ్చని ముఖ్యమంత్రి చెప్పారు, కానీ సలహాలు ఇవ్వడానికి మైక్ ఇవ్వాలని కోరితే ఇవ్వలేదు. ప్రతిపక్షం గొంతు నొక్క ప్రయత్నం చేస్తున్నారు. తక్కువ సభ్యులు ఉన్నవారికి మైక్ ఇస్తున్నారు, మాకు ఇవ్వడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బెట్టింగ్ యాప్స్ బ్యాన్ చేస్తూ వచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలనలో బెట్టింగ్ యాప్స్‌ని కంట్రోల్ చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రతి మూడు గంటలకు ఒక అత్యాచారం, ఆరు గంటలకు ఒక హత్య జరగుతున్నది. లా అండ్ ఆర్డర్ మెయిన్టైన్ చేయడంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఫెయిలయ్యారు. ఒకరోజే హైదరాబాద్‌లో రెండు అత్యాచార ఘటనలు, రెండు హత్యలు జరిగాయి. హైదరాబాద్‌లో 50 శాతం సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పెట్టిన సీసీ కెమెరాలును మెయింటైన్ చేయడంలో ఫెయిల్ అయ్యారు. పోలీసులకు ఆత్యాధునిక వాహనాలు మేం కొనిస్తే మీరు డీజిల్ పోయించే పరిస్థితిలో కూడా లేరు. పోలీస్ చరిత్రలో పోలీసు కుటుంబాలను పోలీసుల చేత అరెస్టు చేయించిన ఘనుడు సీఎం రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు విమర్శించారు. అమనగల్‌లో ముఖ్యమంత్రి భూముల కోసం నాలుగు లైన్ల రోడ్లు రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్ ఉండగా మరో రోడ్డు ఎందుకని ప్రశ్నించారు. రూ. 5000 కోట్లు- ఖర్చుపెట్టి 10 లైన్ల రోడ్డు ఎందుకు వేస్తున్నావ్. ఉద్యోగులకు పెన్షనర్లకు ఇవ్వడానికి డబ్బులు లేవని చెబుతూనే రూ. 5000 కోట్లతో అత్తగారి ఊరికి రోడ్లు వేస్తారా? అని ప్రశ్నించారు. జానారెడ్డి గారిని ఆదర్శంగా తీసుకోండి అన్నారు సీఎం. ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏసీడీపీ నిధులు ఇవ్వాలని కోరితే వెంటనే కేసీఆర్ వచ్చారు. మీరు కూడా ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏసీడీపీ నిధులు ఇవ్వండని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భూములమ్మితే బొంద పెట్టడానికి కూడా స్థలం మిగలదు అని చెప్పి.. ఈరోజు అసెంబ్లీ సాక్షిగా భూముల అమ్మకాన్ని సమర్థిస్తున్నారు. గచ్చిబౌలిలోని 400 ఎకరాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాడి కాపాడింది.. మీరు అధికారంలోకి వచ్చాక కోర్టు తీర్పు వచ్చిందని, వాటిని కాపాడకుండా అమ్మితే ఎలా అన్నారు.




# కాళేశ్వరం ఎలా వినియోగించాలో చూపిస్తాం

**చేతగాకపోతే తప్పకోవడం మేలు**

**దోచుకోవడం.. దాచుకోవడం కాంగ్రెస్ నైజం**

**ఎండిన పంటపొలాలను పరిశీలించిన జగదీశ్ రెడ్డి**

**ప్రజానావ, సూర్యాపేట:** కాంగ్రెస్ ప్రభుత్వంలో దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి ఏమి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శించారు. బుధవారం చివ్వెంల మండలం మొగ్గాయగూడెంలో ఎండిపోయిన పంట పొలాలను బీఆర్ఎస్ నేతలతో కలిసి జగదీష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సోయిలేకుండా ప్రవర్తిస్తోందని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ తీసుకున్నడు.. కానీ దానిపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. పాలన చేతగాక పోతే మాకు అప్పగించండి.. కాళేశ్వరం నీటిని ఏ విధంగా విడుదల చేయాలో చేసి చూపిస్తామని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కేసీఆర్ అద్భుతమైన ప్రణాళికతో తెలంగాణను భారతదేశంలోనే నెంబర్ వన్‌గా చేశాడని.. కాంగ్రెస్ వచ్చాక ఆర్థిక రంగం మొత్తం కుదేలై వెనకబడే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. ఈ ఏడాది ప్రజల ఖజానాకు రావాలసిన రూ.15 వేల కోట్ల డబ్బులు మీ జేబుల్లోకి పోయిందని స్పష్టంగా అర్థమవు తుందని ఆరోపించారు. తెలంగాణ కోసం కేసీఆర్ పడ్డ పదేళ్ల కష్టం నామరూపల్లె లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏండ్లలో అభివృద్ధి చేసి చూపిస్తే సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ తెలంగాణను నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. ఇకనైనా ప్రభుత్వం సాగునీరు ఇస్తే కొన్ని పొలాలైనా చేతికొచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఆలోచించి తక్షణమే రైతులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కు విజ్ఞప్తి చేస్తున్నాం.. చివరి పంటకు సాగుకైన నీటిని విడుదల చేయాలన్నారు.

# రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం

**30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం**

**అసెంబ్లీలో స్పష్టం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ప్రజానావ, హైదరాబాద్:** రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తామన్న హామీని అమలు చేయబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుదారులతో కలసి అందరికీ దీనిని వర్తింప చేస్తామని అన్నారు. త్వరలోనే ఇతర నిత్యావసర వస్తువులను కూడా కార్డుదారులకు అందిస్తామని ప్రకటించారు. దేశంలోనే తొలిసారిగా ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరాకు శ్రీకారం చుడుతున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీ అంశంలో విజిలెన్స్ నివేదిక వచ్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక వచ్చిన తర్వాత మరమ్మతుల విషయంపై దృష్టిసారిస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమని.. ప్రపంచస్థాయి నిపుణులను భాగస్వామ్యం చేసి సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ప్రమాదం జరిగిన 3 గంటల్లోపే తాను అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. సభ జరుగుతున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధమని, లాబీల్లో ఫొటోలు తీసిన బిఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్షల్స్‌పై బిఆర్ఎస్ సభ్యులు దౌర్జన్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలతోనే బిఆర్ఎస్‌ను ప్రజలు అక్కడ కూర్చోబెట్టారని, బిఆర్ఎస్ నేత కవిత లిక్కర్ స్కామ్ చేయడంతోనే ఢిల్లీలో ప్రభుత్వం పోయిందని ఎద్దేవా చేశారు. సభలో బిఆర్ఎస్ కావాలని హంగామా చేసిందని, కావాలని లాబీల్లోకి వెళ్లి షో చేశారని దుయ్యబట్టారు.

# భూ భారతిపై వాడీవేడి చర్చ

**వచ్చే ఎన్నికల్లో ధరణితో వెళ్లాలని పొంగులేటి సవాల్**


**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో 'భూ భారతి'పై వాడీవేడి చర్చ జరిగింది. భూభారతిపై అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది.. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ పథకాలు అమలు చేస్తున్నారని.. ఇది భూభారతి కాదు భూహారతి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విపక్ష బిఆర్ఎస్ ఆరోపణలను అధికార పక్షం ఘాటుగా తిప్పికొట్టింది. ధరణి పేరుతో ప్రజల భూములను లాక్కున్న దుర్మార్గాలను అడ్డుకున్నామని తెలిపింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అని భట్టి విక్రమార్క అన్నారు. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని.. అలానే చేశామని చెప్పారు. ధరణిపై ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతకుముందు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది భూ భారతి కాదని.. భూ హారతి అని ఆరోపించారు. ఈ క్రమంలో పల్లా వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ధరణి వద్దని ఓటుతో ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. అన్ని వర్గాలతో చర్చించాకే భూభారతి తెచ్చామని అన్నారు. భూభారతి కాన్సెప్ట్ తో ఈసారి ఎన్నికలకు వెళ్తామని.. ధరణి కాన్సెప్ట్ తో బీఆర్ఎస్ నేతలు ఎన్నికలకు రాగలరా అంటూ మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారో చూద్దామని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు పొంగులేటి. అసత్యాన్ని సత్యం చేసేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మేము వచ్చే ఎన్నికల్లో భూ భారతి గురించి చెప్పి ఎన్నికలకు పోతాం.. బీఆర్ఎస్ ధరణి పేరుతో ఎన్నికలకు వెళ్తారా? అని ప్రశ్నించారు. మీకు మాట్లాడే నైతిక హక్కు లేదు.. ధరణి తెచ్చి రూల్స్ అసలు ఫ్రేమ్ చేయలేదు.. మేము చట్టం తెచ్చి రూల్స్ సిద్ధం చేస్తున్నాం.. మీరు మాకు చెప్పడం ఎందుకు అని ప్రశ్నించారు. పేదలకు మేము ఇందిరమ్మ ఇండ్ల ఇస్తున్నాం.. వాళ్ళ మాదిరిగా మేము పార్టీల కార్యకర్తలు ఇవ్వం అని తెలిపారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఇక, ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్ సర్పంచ్.. మీలాగా బీఆర్ఎస్ నాయకులను పెట్టలేదు.. సభను పదే పదే తప్పుదోవ పట్టిస్తున్నారు అని మంత్రి పొంగులేటి తీవ్రంగా మండిపడ్డారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# నిరుద్యోగులకు వరంగా యువ వికాసం

## వందశాతం రాయితీతో రూ. 50 వేల యూనిట్లు



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో యువ వికాసం పథకం నిరుద్యోగులకు వరంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు ప్రత్యేకంగా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం సహాయం చేయడానికి ప్రభుత్వం వివిధ చర్యలను అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ జనాభా ప్రాతిపదికన యూనిట్లు ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను కలెక్టర్లు మండలాలు, సంక్షేమ వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లు మంజూరు చేయనున్నారు. రూ.50 వేల విలువైన యూనిట్లకు 100 శాతం రాయితీ కల్పిస్తారు. ఈ పథకం విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా అర్హులైన యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విధివిధానాలు ఇలా ఉన్నాయి. కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు.. దీనిలో వితంతు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు ఉంటాయి. తెలంగాణ ఉద్యమం, ఎస్సీ వర్గీకరణ పోరాటంలో పాల్గొన్నవారికి.. స్వయం ఉపాధిలో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తు ఫారమ్‌ను పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసి.. సంబంధిత పత్రాలను జతచేసి మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేయాలి. ఇటువంటి పథకాల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించబడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షల రూపాయల కుటుంబ ఆదాయం, పట్టణాల్లో 2 లక్షల రూపాయల ఆదాయం ఉన్న వారు ఈ పథకంలో భాగస్వామి కావచ్చు. దరఖాస్తు చేయడానికి అభ్యర్థులు కొన్ని ముఖ్యమైన పత్రాలు జతచేయాలి. వాటిలో రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలి. ఎంపికైన వారికి 15 రోజుల పాట ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత యూనిట్లను మంజూరు చేసి.. అవసరం అయిన వారికి సహాయం చేస్తారు. ఇక యూనిట్ గ్రౌండ్ చేసిన వారికి ఆరు నెలల నుంచి ఏడాది వరకు నిపుణుల ఆధ్వర్యంలో సాంకేతిక శిక్షణ ఇస్తారు. వ్యవసాయం కాకుండా ఇతర పథకాలకు దరఖాస్తు చేసిన వారి వయస్సు 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి. వ్యవసాయ పథకాలకు అయితే 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు అర్హులు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఏప్రిల్ 5 చివరి తేదీగా నిర్ణయించారు. తర్వాత ఏప్రిల్ 6 నుంచి 20 వరకు మండలస్థాయి కమిటీల ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు. జూన్ 2 తర్వాత అర్హులకు మంజూరు పత్రాలు జారీ చేస్తారు.



# పోలీసుల నిర్లక్ష్యం

### విద్యార్థికి పదిలక్షల ఫైన్

### కోర్టు సమన్లతో ఖంగుతిన్న విద్యార్థి

**గాంధీనగర్:** సాధారణంగా హెల్మెట్ పెట్టుకోకుండా పోలీసులకు దొరికితే 500 నుంచి రూ.1000 వరకు ఫైన్ ఉంటుంది. కానీ, ఓ విద్యార్థికి మాత్రం పోలీసులు ఏకంగా రూ10 లక్షల ఫైన్ వేశారు. అంత పెద్ద మొత్తంలో ఫైన్ పడటం చూసి అతడు షాక్ అయ్యాడు. ఈ సంఘటన అహ్మదాబాద్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. ఆ వివరాల్లోకి వెళితే.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన అనిల్ హాదియా. అనే లా విద్యార్థి బైకు మీదే లా కాలేజీకి వెళుతూ ఉంటాడు. గతేడాది ఏప్రిల్ నెలలో కూడా హెల్మెట్ లేకుండా బైకు నడుపుకుంటూ కాలేజీకి వెళుతూ ఉన్నాడు. శాంతిపుర ట్రాఫిక్ సర్కిల్ దగ్గర ట్రాఫిక్ పోలీసులకు దొరికాడు. దీంతో పోలీసులు అతడికి ఫైన్ వేశారు. కొద్దిరోజుల తర్వాత అతడి ఇంటికి కోర్టు సమన్లు వచ్చాయి. హెల్మెట్ లేకుండా బైకు నడిపినందుకు గాను.. రూ.10,00,500 కట్టాలని అందులో ఉంది. దీంతో అతను అనిల్‌ను మెట్రోపాలిటన్ కోర్టుతో పాటు పోలీస్ కమిషనర్ దగ్గరకు తీసుకెళ్లాడు. అనిల్ అక్కడ తన గోడు వెల్లబోసుకున్నాడు. పోలీస్ కమిషనర్ ఈ ఘటనపై ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. రూ.500కు బదులుగా రూ.10,00,500 అని తప్పుగా పడినట్లు తేలింది. దాన్ని సరిచేస్తామని అధికారులు అనిల్‌కు భరోసా ఇచ్చారు. దీంతో అనిల్ ఊపిరి పీల్చుకున్నాడు.

## సంపాదకీయం



# పర్యావరణ విధ్వంసం!


దేశంలో ఎండలు ముదరుతున్నాయి. పట్టణాల్లో ఎండల తీవ్రత తీవ్రంగా ఉంటోంది. గ్రామాల్లోనూ ఎండలు మంటపుట్టిస్తున్నాయి. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో ఇంటిముందున్న చెట్లను నరికి వేస్తున్నారు. కోతుల బెడ నుంచి ఇప్పటికి రక్షణకు కార్యాచరణ కానరావడం లేదు. అడవులను వదిలి అవి గ్రామాల్లో తిష్టవేశాయి. ఇక ప్రజలు మొక్కల పెంపకాన్ని వదిలి చల్లదనం కోసం కూలర్లు, ఏసిలు వాడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఇదే సందర్భంలో కాలుష్యాన్ని కొని తెచ్చుకుంటున్నాం. మొక్కలు నాటడం,పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న విషయాలను పక్కన పెట్టారు. ఇదంతా ప్రభుత్వాల పని అన్నట్లుగా ప్రజల భావన ఉంది. అందమైన ఇల్లు కట్టుకుంటున్న వారు సైతం నాలుగు మొక్కలు నాటాలన్న స్పృహ లేకుండా పోతున్నది. మొక్కలు నాటేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఫోటోలకు పోజులిచ్చే కార్యక్రమంగా మారింది. తమ ఇళ్లల్లోనే ఓ మొక్కను నాటి గ్రీన్ ఛాలెంజ్ అంటూ ఇంతకాలం ప్రచారం చేసుకున్నారు. నిజానికి గ్రీన్ ఛాలెంజ్ అంటే గ్రామాల రూపురేఖలు మారాలి. కానీ అలా జరగడం లేదు. హరితహారంలో 200 కోట్లమొక్కలు నాటామిన ఘనంగా చెప్పిఉకున్న బిఆర్ఎస్ పాలకులు వాటి ఆనవాళ్లు ఎక్కడో చూపితే బాగుండేది. అలా జరిగితే కనీస మార్పు వచ్చి ఉండేది. చంద్రబాబు ఉమ్మడి ఎపిలో ఇలాంటి ప్రచారాలే చేసినా ఎక్కడా మొక్కల జాడలేదు. ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పు కోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు పర్యావరణ విధ్వంసానికి కారణ మవుతున్నాయి. వాగులూవంకల జాడలేకుండా పోయింది. కొండలు, గుట్టలను తవ్వేస్తున్నాం. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటిలే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. అంటువ్యాధుల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని హెచ్చరి స్తున్నా ప్రజలు చలించడం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకుంటున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికి వేస్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు పలు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవుతుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. అకాల వర్షాలు..తట్టుకోలేని ఎండలు..తట్టుకోలేని చలిగాలులు మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పాలకులకు ఇవేవీ పట్టడం లేదు. ఎందుకంటే ఉన్నన్నాళ్లూ పదవి అనుభవించి.. తదుపరి ఏమైతే మాకేంటన్న ధోరణిలో ఉన్నారు. కోట్లాదిమంది చేస్తున్న విధ్వంసం అంటే ప్లాస్టిక్ వాడిపడేం, చెత్తాచెదారం తీసివేయడం వేలల్లో ఉన్న పారిశుధ్య సిబ్బందికి సాధ్యం కాదు. కనీసం ఇక్కడైనా ప్రజలను కట్టుబాట్లు పెట్టివుంటే బాగుండేది. ప్రజలు పారిశుధ్య పనులు లాంటివి ఎందుకనో చేయడం లేదు. దీంతో కాలుష్యం మళ్లీ పెరుగుతోంది. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం లాంటి విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా పట్టింపు లేకుండా ఉన్నాయి. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా.. భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటికాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుం డటంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనిని కనీసం కొంతయినా తగ్గించడానికి కొంతమేరకు అయినా పరిసరాల పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలి. ఇందుకోసం నిరంకుశంగా అయినా ప్రభుత్వాలు ప్రజలను హెచ్చరించాలి. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తు న్నారు. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నది అలవాటు కావాలి.



# త్వరలో పంబన్ బ్రిడ్జి ప్రారంభోత్సవం

**చెన్నై:** తమిళనాడులోని సముద్ర తీరంలో ఉన్న చారిత్రక పంబన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో అదే పేరుతో కొత్త పంబన్ బ్రిడ్జిని నిర్మించారు. ఆధునిక ఇంజనీరింగ్‌తో ప్రజలను, ప్రదేశాలను అనుసంధానిస్తూ వర్టికల్ లిఫ్ట్ విధానంలో భారత్‌తో నిర్మించి తొలి రైల్వే బ్రిడ్జి ఇదే కావడం విశేషం. వేగం, భద్రత, ఆవిష్కరణల కోసం రూపొందించిన బ్రిడ్జి ఇందంటూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల ఆ ఫోటోలను విడుదల చేశారు. దేశంలోని ప్రధాన భూభాగాన్ని తమిళనాడులోని రామేశ్వరం ద్వీపానికి ఈ బ్రిడ్జి కలుపుతుందని ఆయన తెలిపారు. ఈ వంతన మధ్యలో భారీ ఓడలు వచ్చినప్పుడు తెరుచుకునేలా ప్రత్యేక గేట్లు కూడా ఏర్పాటు చేశారు. కాగా, కొత్త పంబన్ బ్రిడ్జి ప్రారంభం కాగానే పాత వంతెనపై రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు. 2020 ఫిబ్రవరిలో నిర్మాణం ప్రారంభమైంది. కోవిడ్ కారణంగా జాప్యం చోటచేసుని ఏప్రిల్‌లో ప్రారంభానికి ముస్తాబవుతోంది.

# అప్సర హత్యకేసులో పూజారి సాయికృష్ణకు జీవితఖైదు



**ప్రజానావ, హైదరాబాద్:** సరూర్‌నగర్ అప్సర హత్య కేసులో పూజారి సాయికృష్ణకు జీవత ఖైదు విధించింది రంగారెడ్డి కోర్టు. అప్సరను ప్రేమంచి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం చేశాడు పూజారి. అప్సరతో నాలుగేళ్లపాటు ప్రేమయాణం సాగించాడు. పెళ్లి చేసుకోమని వెంటపడటంతో.. శంషాబాద్ ప్రాంతంలో హత్య చేసి.. మ్యాన్‌హెూల్‌లో మృతదేహాన్ని పడేశాడు. ఈ కేసులో రంగారెడ్డి కోర్టు నేడు తీర్పు వెల్లడించింది. అతడికి జీవిత ఖైదుతో పాటు.. సాక్ష్యాలను తారుమారు చేసినందుకు అదనంగా మరో ఏడేళ్ల జైలు శిక్షను కూడా విధించింది. వీటితో పాటు.. అప్సర కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. తమిళనాడుకు చెందిన అప్సర డిగ్రీ పూర్తి చేసింది. నటన, మోడలింగ్‌పై ఆసక్తితో ఆమె పలు తమిళ చిత్రాల్లో నటించింది. సినిమా అవకాశాల కోసం ఆమె 2022 ఏప్రిల్‌లో హైదరాబాద్‌కు వచ్చింది. కాశీలోని తన తండ్రి ఒక ఆశ్రమంలో పనిచేస్తున్నారు. తల్లితో కలిసి ఆమె సూరూర్‌నగర్‌లోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆమె తల్లి ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. అప్సర దేవాలయాలకు తరచూ వెళ్తూ ఉండేది. ఆ సమయంలోనే అక్కడ పూజారి సాయికృష్ణతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. తనను పెళ్లి చేసుకోవాలని సాయిపై అప్సర ఒత్తిడి తెచ్చింది. పెళ్లి చేసుకుంటే సరి.. లేదంటే ఇద్దరి మధ్య సంబంధాన్ని భయటపెడతానంటూ ఆమె బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. ఈ విషయం భయటపడితే పరువు పోతుందని భావించిన సాయి.. హత్యకు ప్లాన్ చేశాడు. నాలుగు సార్లు హత్యకు ప్లాన్ చేసినా.. వర్కౌట్ కాలేదు. ఐదోసారి 2023 జూన్ 3వ తేదీన .. కోయంబత్తూరు వెళ్తున్నట్లు.. విమాన టికెట్లు కూడా తీసుకున్నానని నమ్మించాడు. దీంతో ఆమె తమ లగేజీతో సహా ప్రయాణానికి సిద్ధం అయింది. ఆమె తల్లికి శంషాబాద్‌లో దించి వస్తానని చెప్పి తన కారులో తీసుకెళ్లాడు. అక్కడ రాత్రి 11 గంటల సమయంలో.. సుల్తాన్‌పల్లిలోని గోశాల వద్దకు వెళ్లారు. అక్కడ కొంతసేపు గడిపారు. అక్కడే అతడు ఆమెకు కంటపడకుండా.. బెల్లం దంచే రాయిని తన కారులో వేశాడు. జూన్ 4 తెల్లవారు జామున.. గోశాల సమీపంలోని నర్కుడలోని ఓ వెంచర్ వద్దకు చేరారు. ఆమె నిద్రలోకి వెళ్లగానే.. కారు సీటు కవర్‌ను ఆమె ముఖంపై వేసి ఊపిరాడకుండా చేశాడు. అప్పటికే తన కారులో ఉంచిన బెల్లం దంచే రాయిని తీసుకొని.. ఆమె తలపై పదిసార్లు బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే ఊపిరి వదిలింది. మృతదేహంపై కారు కవర్ కప్పి.. అక్కడే కారును పార్కు చేసి.. ఏమి తెలియకుండా.. ఇంటికి వచ్చేసి రోజూవారీ కార్యకలాపాల్లో నిమగ్నం అయ్యాడు. రెండు రోజుల తర్వాత ఆమె మృతదేహాన్ని కవర్‌లో చుట్టి.. సరూర్‌నగరలోని మైసమ్మ ఆలయ సమీపంలోని మ్యాన్‌హెూల్‌లో పడేశాడు. అక్కడ వాసన వస్తున్నట్లు గమనించిన అతడు రెండు ట్రక్కుల ఎర్రమట్టి తెప్పించి.. మ్యాన్‌హెూల్‌లో వేయించాడు. అంతేకాదు.. దానిపై కాంక్రీట్ వేసి పకడ్బందీగా మూసేశాడు.

# బతుకు నావను ఈదే ధైర్యం ఉండాలి!

**ప్రజానావ, తిరుమల:** కష్టాలను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలి. జీవితం అంటే వడ్డించిన విస్తరి కాదు. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం వస్తుందో ఊహించడం కష్టం అందువల్ల కష్టాలను తట్టుకుని నిలబడే ఆత్మసథయిర్యం కలిగి ఉండాలి. కుంగిపోతే మనలను ఎవరూ కాపాడలేరు. పదమూడేళ్లు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాత వాసం..బతుకంతా అడవుల పాలు. అయినా సరే పాండవులు బతికారు. అరణ్యవాసంతం తరవాత శ్రీరాముడు చక్కగా రాజ్యం పాలించాడు. అడవుల్లో ఉన్నా, రాజ్యాధికారంలో ఉన్నా ఒకేలా ఉండాలని ఈ రెండు పురాణాలు మనలను గుర్తు చేస్తుంటాయి. ఎవరు ఈ బతుకును వద్దన్నారు? చాకచక్యంగా జీవిత నావను నెట్టుకుపోతే ప్రయాణ దూరం తగ్గిపోతుంది. లక్ష్యం చేరువవు తుంది. అన్నీ ఉన్న వాళ్లు బతుకుతారు. ఏమీ లేనివాళ్లు సైతం బతుకుతారు. కళ్లులేనివారు, కాళ్లులేనివారు కూడా అద్భుతాలు చేస్తున్నారు. సర్వాంగాలతో చక్కటి శరీరం ఇచ్చిన సర్వేశ్వరుడికి మనం ఎంతో రుణపడి ఉండాలి. మరణం గురించి పదేపదే ఆలోచించనక్కర్లేదు. మరణం బతుకు రహస్యం ముడి విప్పుతుంది. బతుకు జీవనసారం



ఆధ్యాత్మికం

అనుభవంలోకి తెస్తుంది. అపరిష్కృతంగా ఉన్న సమస్యను నల్ల బల్ల మీద నుంచి తుడిచి వేస్తే సమస్య పరిష్కారం కాదు. శోధించి, సాధించాలి. జీవించి చూపించి, సత్యాన్ని సాధించాలి. చెట్లు పైకి ఎదుగుతాయి. నిన్నటి వరకు పాకే పిల్లాడు ఈ రోజు నడుస్తాడు. సన్నటి పాయలుగా పారే నది, ప్రవహించి ప్రవహించి సముద్ర రూపం పొందుతుంది. గొప్పగా బతకడంలోనే బతుకు రహస్యం బోధ పడుతుంది. దివ్యంగా బతకడంలో జీవన పరమార్థం నెరవేరుతుంది. బతకడం ఎవరూ నేర్పనక్కర్లేదు. శరీరంలో, మనసులో, ఆత్మలో బతుకు విత్తనం ఎప్పుడో వేశాడు ఆ పైవాడు. దాని మీద ఆనందం అనే ఎరువు వేసి, సంతోషం అనే నీళ్లు జల్లుతూ ఉండాలి. అప్పుడు బతుకు వృక్షం పచ్చగా ఎదుగుతుంది. మనం వృక్షాలుగా మారితే చిలుకలు వాటంతటవే వచ్చి వాలుతాయి. కోకిలలు చెట్లను వేదికలు చేసుకుని కచేరీలు చేస్తాయి. బతుకు ఒక పాట. హాయిగా పాడుకోవాలి. బతుకు ఒక ఉత్స వం. ఆనందానికి అర్థం చెప్పాలి. విషాదంగా ఉండటం ఆధ్యాత్మికత అని ఎవరూ చెప్పలేదు. విషాదాన్ని జీవితం నుంచి తరిమికొట్టడమే దివ్యమైన జీవితం! అజ్ఞానమే బతుకును అవగాహనకు రానివ్వకుండా చేస్తుంది. మొత్తం బతుకంతా బతకడానికే వచ్చింది. ఏదో ఒక పడవ తీసుకుని, ఎవరికి వారే సరంగులై నది దాటి ఒడ్డు చేరుకోవాలి. మరో ప్రయాణం మొదలు పెట్టాలి. ఈ యాత్ర ఆగదు. ఇది బతుకు యాత్ర..

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
గురువారం
27 మార్చి 2025


# 'భూ భారతి'తో రెవెన్యూ శాఖ బలోపేతం



- గ్రామస్థాయిలోనే రెవెన్యూ సేవలందించాలనేది ప్రభుత్వ సంకల్పం
- ఇందులో భాగంగానే 10,954 మంది గ్రామ పాలన అధికారుల నియామకం
- లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలను అందించేందుకు రెవెన్యూ ఉద్యోగులు సైనికుల్లా పనిచేయాలి
- ప్రభుత్వ సహకారంతో తక్కువ సమయంలో ఎక్కువ విజయాలు
- చరిత్రలో తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులు సాధించాం
- భూ భారతి చట్టంలో తహశీల్దార్లు, ఆర్డీఓలు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వీ.లచ్చిరెడ్డి
- సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు

**ప్రజానావ, ములుగు/హైదరాబాద్:** ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రెవెన్యూ శాఖ బలోపేతం అవుతుందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ.లచ్చిరెడ్డి అన్నారు. నూతన చట్టంతో త్వరలోనే భూ సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం దొరుకుతుందన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణగా మార్చేందుకు రెవెన్యూ ఉద్యోగులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ములుగు జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రెవెన్యూ శాఖతో పాటు రెవెన్యూ సేవలలో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం బ్10,954 మంది గ్రామ పాలన అధికారులను ఆప్షన్ల ద్వారా నియామకం చేస్తుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల ఆకాంక్ష, ఉద్యోగుల పోరాటానికి ప్రభుత్వ సహకారం తోడవడంతో రెవెన్యూ శాఖలోకి గ్రామ స్థాయిలో రెవెన్యూ సేవలు అందించేందుకు మార్గం సుగమం అయ్యిందన్నారు. అయితే రాష్ట్రంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు రెవెన్యూ శాఖ ఉద్యోగులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సహకారంతో తక్కువ సమయంలోనే ఎక్కువ విజయాలు సాధించామని, రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాదించామన్నారు. అలాగే గతంలో ధరణిలో తహశీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్ల అధికారాలు లేని కారణంగా రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించే పరిస్థితి లేదన్నారు. కానీ త్వరలోనే అమల్లోకి రాబోతున్న భూ భారతి చట్టంలో తహశీల్దార్లకు ఆర్డీఓలకు, జేసీలకు అధికారాలు ఉంటాయన్నారు.

## గ్రామస్థాయిలోనే రైతులకు సేవలు

భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్ఏ నుండి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరిగిందన్నారు. జీపీవోల వలన రైతులకు గ్రామ స్థాయిలో సేవలు అందడంతో పాటు సత్వర సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలనలో ప్రభుత్వం ఒకవైపు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేస్తూనే .. మరోవైపు రైతులు, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలను క్షేత్రస్థాయిలోనే అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. నాడు రైతులకు, ప్రజలకు దూరాభారమైన రెవెన్యూ సేవలు త్వరలోనే గ్రామ స్థాయిలోనే అందుతాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు, రాష్ట్ర మంత్రివర్గం, రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ పెద్దల, ఉన్నతాధికారుల అందరి సహకారంతో అనతి కాలంలోనే అనేక చారిత్రిక విజయాలను తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సొంతం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉందన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని అన్ని శాఖల ఉద్యోగులకు అండగా నిలుస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో అనేక విజయాలు సాధించిన రెట్టించిన ఉత్సాహంతో ఉద్యోగులు ప్రజా సంక్షేమానికి పునరంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు.

## తక్కువ సమయంలో ఎక్కువ విజయాలు..

33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాధించడంతో పాటు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల సంఖ్యను పెంచడం, గ్రామ స్థాయిలో రెవెన్యూ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామానికో అధికారిగా 10,954 పోస్టుల ఏర్పాటు మనకు అతిపెద్ద విజయాలుగా లచ్చిరెడ్డి అభివర్ణించారు. అలాగే జీఓ నం.317 రాష్ట్రంలో ఉద్యోగులను చిన్నాభిన్నం చేసిందన్నారు. ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలకు సైతం చెట్టుకొక్కరికి పుట్టకొక్కరికి పోస్టింగ్ లు ఇచ్చారన్నారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా ఉద్యోగుల ఆంక్షలను, 317 జీవోలోని నిబంధనలను ప్రభుత్వం సడలించిందన్నారు. ముఖ్యంగా స్పోజ్, మెడికల్, తదితర కోణాలలో ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించిందన్నారు. అలాగే రాష్ట్రంలో కొత్త డివిజన్లు, కొత్త మండలాల్లో పోస్టుల మంజూరు, జూనియర్ అసిస్టెంట్ల నుంచి డిప్యూటీ కలెక్టర్లు వరకు పదోన్నతులు సాధించడం, తహశీల్దార్లు, ఆర్డీఓలు, జేసీలు గతంలో కొల్పోయిన అధికారాలను భూభారతి చట్టం-2025తో పునరుద్ధరణ, పూర్వ వీఆర్ఏ, వీఆర్వోలను ఆప్షన్ పద్ధతిలో తిరిగి మాతృశాఖలోకి తీసుకోవడం తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ సాధించిన విజయాలు అన్నారు. అలాగే పూర్వ వీఆర్ఏలు వేర్వేరు జిల్లాలకు బదిలీ అయిన వారిని తిరిగి వారి సొంత జిల్లాకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సుమారు 10 ఏళ్ల తర్వాత 330 మందిని అధికారికంగా అవుట్‌సోర్సింగ్ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా నియాకం చేయడం జరిగిందన్నారు. 670 మంది ఫీల్డ్ అండ్ టెక్నికల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ యాజమాన్యం నుండి ప్రభుత్వ కార్పొరేషన్‌కు బదిలీ చేసేందుకు శాయాశక్తుల కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు రెవెన్యూ ఉద్యోగులుగా మనం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మనం కోరుకుంటున్న సంక్షేమం, ఇతర శాఖాపరమైన పదోన్నతులు, బదిలీలు మరియు సీనియారిటీ అంశాలను గురించి అంతా ఒక చోట కలిసి చర్చించుకోవాల్సిన సందర్భం ఆసన్నమైందన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకొని మనందరం ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. సమీప భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించుకుంటామని జేఏసీ చైర్మన్ వీ.లచ్చిరెడ్డి తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, జనగామ ఆర్డీవో గోపీరామ్, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న, హన్మకొండ ఆర్డీవో రాథోడ్ రమేశ్, టీజీటీఏ సెక్రటరీ జనరల్ పూల్ సింగ్, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షులు పీ.రాధ, టీజీటీఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చిల్ల శ్రీనివాస్, టీజీఆర్ఎస్ఏ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత చౌహాన్, టీజీఆర్ఎస్ఏ సీసీఎల్ఏ విభాగం అధ్యక్షులు కృష్ణ చైతన్య, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని తహశీల్దార్ లు, ఉమ్మడి వరంగల్ జిల్లా టీజీటీఏ, ఉమ్మడి వరంగల్ జిల్లా టీజీఆర్ఎస్ఏ కార్యవర్గ నేతలు ఇక్బాల్, అల్లం రాజు కుమార్, నాగేశ్వరరావు, విక్రమ్ కుమార్, విశ్వప్రసాద్, రంజిత్ కుమార్, రేణుక గిరిబాబు, సురేష్ బాబు, సమ్మయ్య, మేఘన, మమత తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న హుండీ ఆదాయం రూ.1.95కోట్లు



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఖజానాకు హుండీ రూపంలో రూ.కోటి 52 లక్షలకుపైగా ఆదాయం సమకూరింది. 20 రోజుల వ్యవధిలో భక్తులు స్వామివారి హుండీలలో సమర్పించిన నగదు, బంగారు, వెండి కానుకలను బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా 1 కోటి, 95 లక్షల, 75 వేల, 168 రూపాయల నగదు, 287 గ్రాముల బంగారం, 18 కిలోల 500 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో కే.వినోద్ రెడ్డి తెలిపారు. ఆలయ సిబ్బంది, వలంటీర్లు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. వేములవాడ అనుబంధ ఆలయం నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీ లెక్కింపును కూడా అధికారులు నిర్వహించారు. సుమారు ఆరు నెలల హుండీ ఆదాయం 11లక్షల 47వేల 510 రూపాయిలు సమకూరినట్లు పేర్కొన్నారు.

# ఆటో డ్రైవర్‌కు రూ.2వేల జరిమానా

**ప్రజానావ, సిరిసిల్ల:** పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకొని నిర్లక్ష్యంగా ఆటో నడిపిన డ్రైవర్‌కు రూ.2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు బుధవారం ముస్తాబద్ ఎస్ఐ గణేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొమిరె అభిషేక్ 2024 ఆగస్టు 7వ తేదీన అతివేగంగా, నిర్లక్ష్యంగా ఆటోలో పరిమితికి మించి (16 మంది విద్యార్థులు) ఎక్కించుకొని ఆటో నడిపాడు. నామపూర్ గ్రామం ఎక్స్ రోడ్డు వద్ద విధులు నిర్వహిస్తున్న బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ ఖాసీం పెట్రోలింగ్ లో భాగంగా ఆటోను ఆపి ఫిర్యాదు చేశాడు. ముస్తాబద్ ఎస్సై గణేశ్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ ఆటో డ్రైవర్‌కు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకుంటే ఆటో డ్రైవర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దాడి కేసులో ఒకరికి జైలు, జరిమానా



**ప్రజానావ, సిరిసిల్ల:** వ్యక్తి పై దాడి చేసిన కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అంకరపు ప్రభాకర్ తండ్రి పాత పగలను దృష్టిలో ఉంచుకొని 2017 జూన్ 4వ తేదీన తన ఇంటికి ఉన్న టులేట్ బోర్డును ఇంటి పక్కనే ఉన్న కాముని వనిత, కాముని అరుణ, వడ్డేపల్లి సుజాత అనే మహిళలు తీశారని వారిని పరుష పదజాలంతో తిట్టడమే కాకుండా కర్రతో దాడి చేశాడు. దీనిపై కాముని వనిత సిరిసిల్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో అప్పటి సిరిసిల్ల ఏఎస్ఐ అనంత రెడ్డి నిందితుడు అంకారపు ప్రభాకర్ మీద కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారి ఎండీ లియకత్ అలీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేశ్ కోర్టులో పది మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ నేరం రుజువు కావడంతో నిందితుడైన అంకరపు ప్రభాకర్‌కు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# క్రీడలతోనే శారీరక, మానసికోల్లాసం



- పోలీసులు క్రీడలపై దృష్టి సారించాలి
- వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

**ప్రజానావ, వేములవాడ:** విధి నిర్వహణలో భాగంగా ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండే పోలీసులపై తీవ్ర ఒత్తిడి ఉంటుందని, ఈ ఒత్తిడిని జయించేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని వేములవాడ సబ్ డివిజన్ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బందిలో ఒత్తిడిని తగ్గించి వారు శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించాలనే లక్ష్యంతో వేములవాడ పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఏఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక షటిల్ కోర్టు ఏర్పాటు చేశారు. ఈ కోర్టును బుధవారం రాత్రి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైల తో కలిసి ఏఎస్పీ ప్రారంభించారు. అనంతరం కాసేపు షటిల్ ఆడుతూ అధికారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ 24 గంటలు విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారులకు కాస్త ఉపశమనం కలిగించడంతో పాటు అధికారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పలనే ప్రధాన ఉద్దేశంతో ఈ కోర్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని మానసిక ప్రశాంతతను పొందాలని సూచించారు. అనంతరం పలువురు పోలీస్ అధికారులు మాట్లాడుతూ తమ ఆరోగ్య పరిస్థితులు, శారీరక, మానసిక దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకొని షటిల్ కోర్టు ఏర్పాటుకు కృషిచేసిన ఏఎస్పీ శేషాద్రిని రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు వీర ప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, రమేశ్, అంజయ్య, అశోక్, పృథ్వీధర్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




కాయకల్ప చికిత్సలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం తిప్పాపూర్ ఏరియా ఆస్పత్రికి డస్ట్ బీన్స్, మాప్స్, ఫినాయిల్, పైడల్ డస్ట్ బిన్స్, ఫుట్ మాట్స్‌ను డా.పెంచలయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కటుకం శ్రీనివాస్, సెక్రటరీ బాశెట్టి శ్రీనివాస్, లయన్ డా. అనదర్ రెడ్డి, డా. నాగ రమేశ్, తీగల వెంకటేశ్వరావు, లయన్ ఎరవెల్లి రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఏడే హాస్పిటల్‌లో తులసీ మొక్కలను నాటారు.
- ప్రజానావ, వేములవాడ

# నూతన నియామకం



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ అర్బన్ గ్రామం రుద్రవరంలో అంబేద్కర్ మాల సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎరగొక్కుల రమేశ్ (రైస్ డిపో) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మద్దెల నవీన్ కుమార్, వంకాయల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా వంకాయల కనుకయ్య, కార్యదర్శిగా ఎరగోక్కుల వీరేందర్, కోశాధికారి ఎరగోక్కుల రమేశ్, గౌరవ సలహాదారులుగా వంకాయల నరేశ్, వంకాయల మహేశ్, కూతురు బక్కయ్య, ఎరగోక్కుల సురేశ్, వంకాయల అనిల్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రమేశ్ మాట్లాడుతూ కుల బాంధవుల కోసం నిత్యం పాటుపడతానని తెలిపారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# శుభ్రం చేసిన ధాన్యాన్ని తరలించాలి

## అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**ప్రజానావ, సిరిసిల్ల:** యాసంగి సీజన్లో పండించిన వరి ధాన్యాన్ని పూర్తిగా శుభ్రం చేసిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తరలించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. యాసంగి 2024-25 వరి ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావే శానికి అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. క్వింటాలు వరి ధాన్యం గ్రేడ్ ఏ రకానికి రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300 రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలని ఉద్దేశంతో జిల్లాలో ఐకెపి ఆధ్వర్యంలో 172 కేంద్రాలు, పిఎసిఎస్ ఆధ్వర్యంలో 57 కేంద్రాలు, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో , మెప్మా ఆధ్వర్యంలో ఆరు కేంద్రాలచొప్పున ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు ఈ సీజన్లో గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో దాన్యం సేకరణలో ఇలాంటి ఇబ్బందులు ఉండకుండా సెంటర్ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ధాన్య విక్రయించడం వెంటనే డబ్బులు అందేలా ట్యాబ్ ఎంట్రీ సకాలంలో చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మహిళా సాధికారత దిశగా జిల్లాలో ఈ ఏడాది యాసంగి సీజన్లో 128 సెంటర్లను ఐకెపి వారికి కేటాయించాలని వెల్లడించారు ఈ సన్నాక సమావేశంలో డి ఆర్ డి ఓ శేషాద్రి, డి సి ఎస్ ఓ వసంత లక్ష్మి డిఎం రజిత, అగ్రికల్చర్ ఏడి రామారావు, జిల్లా కోపరేటివ్ అధికారి రామకృష్ణ, అడిషనల్ డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, సిబ్బంది సహక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముంపు నిర్వాసితులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి



**ప్రజానావ, వేములవాడ:** మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీజేపీ వేములవాడ అర్బన్ మండలాధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఇస్తామన్న డబ్బులతో పాటు పెండింగ్ లో ఉన్న నష్టపరిహారం, పట్టాలు, ప్యాకేజీ ఇచ్చి ముంపు గ్రామ నిర్వాసితులకు ఉపాధి చూపించాలన్నారు. అనంతరం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, సీనియర్ నాయకులు లింగపల్లి శంకర్, ఏరెడ్డి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్, నర్సింగోజు శంకర్, ఉపాధ్యక్షులు బీరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎరుగోక్కుల రమేశ్, తిప్పారవేని రాజు, జింక శ్రీనివాస్, విశ్వనాథుల శ్రీధర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజానావ, కరీంనగర్: ఇఫ్తార్ విందులు మత సామర స్యానికి ప్రతీకగా నిలుస్తాయంది... గంగా జమున తెహజీబ్ కు ప్రతిరూపంగా మారుతాయని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు, ఎంఐఎం పార్టీ కరీంనగర్ ఆధ్వర్యంలో కాశ్మీర్ గడ్డ ఐబీఏ గార్డెన్ లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ కు, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు అలుగునూర్ బ్రిడ్జి వద్ద ఘన స్వాగతం పలికారు,

# అందరికీ రిజర్వేషన్ ఫలాలు లక్ష్యం



- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- వేములవాడ, సిరిసిల్లలోని మహాలక్ష్మి వీధి, న్యూఅర్బన్ కాలనీ, ఇందిరా నగర్, గీతా నగర్లో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పర్యటన

**ప్రజానావ, వేములవాడ/ సిరిసిల్ల:** బీసీ రిజర్వేషన్ ఫలాలు బి.సి. కులంలోని అందరికీ అందించడమే తమ లక్ష్యమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ స్పష్టం చేశారు. పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మలి తదితర కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా పర్యటనకు విచ్చేసి, ముందుగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ మహాలక్ష్మి వీధిలోని దొమ్మరి వారు, న్యూ అర్బన్ కాలనీలోని పిచ్చ గూంట్ల వారు, సిరిసిల్ల మార్కెట్ యార్డ్ సనీయంలోని ఇందిరా నగర్ లోని పిచ్చ గూంట్ల వారు, గీతానగర్ సమీపంలోని దొమ్మరి వారితో సమావేశమయ్యారు. అంతకముందు ఉదయం వేములవాడలో తమ్మల కులం బాద్యులతో మాట్లాడారు.

### తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలి

తమ్మల కులం వారితో బీసీ కమిషన్ బాధ్యులు మాట్లాడారు. తమ్మల కులానికి శూద్ర, నాన్ బ్రాహ్మణ్ పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వడం తో ఆలయాల్లో అర్చక, ఇతర ఉద్యోగాల్లో పొందడంలో ఇబ్బంది పడుతున్నామని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తమకు తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

### దొమ్మరి కులం పేరు మార్చాలి

కులం సర్టిఫికెట్లో తమ కులం పేరు ను గాడే వంశీయులు గా మార్చాలని దొమ్మరి కులం బాద్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వేములవాడ, సిరిసిల్లలోని వారి ఇండ్లు, ఆర్థిక, విద్యా స్థితిగతులను కమిషన్ చైర్మన్, సభ్యులు తిరిగి పరిశీలించారు. వారి ఉపాధి మార్గాలు, ఆదాయ స్థితి,విద్యా స్థితి పై ఆరా తీశారు. కులం పేరు దొమ్మరి ఉండడంతో తాము సమాజంలో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. విద్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లో అవమానానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడారు. దొమ్మరి కులం పేరు సమస్య పై అధ్యయనం చేసేందుకు ఇక్కడికి వచ్చామని తెలిపారు. హూ

### విద్యా స్థితి వివరాలపై ఆరా..

అనంతరం వేములవాడ లోని న్యూ అర్బన్ కాలనీ, సిరిసిల్ల ఇందిరానగర్ లోని పిచ్చగూంట్ల (వంశరాజ్), పలువురు ఇండ్లలోకి వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడారు. వారు చేస్తున్న పని, ఎన్ని కుటుంబాలు ఎందరు ఉన్నారో ఆరా తీశారు. నెలకు ఎంత ఆదాయం వస్తుంది? విద్యా స్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కులం పేరు పిచ్చగూంట్ల ఉండడంతో తాము సమాజంలో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. విద్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లో అవమానానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అందించే బిల్లు కు శాసన సభలో ఆమోదింపజేసిందని తెలిపారు. కులం పేరిట ఇబ్బంది పడుతున్నవారు ఆత్మన్యూనతా భావానికి గురికావద్దన్నారు. పిల్లలను తప్పకుండా చదివించాలని, రిజర్వేషన్ ఫలాలు పొందాలని సూచించారు. ఆయా కులాల పేర్ల మార్పు అంశం వచ్చే నెలలో పరిష్కరిస్తామని తెలిపారు. బీసీ కులాల్లోని అందరికీ రాజ్యాంగ ఫలాలు అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో పర్యటించామని గుర్తు చేశారు. త్వరలో మిగతా జిల్లాల్లో పర్యటించి, ఆయా బీసీ కులాల స్థితిగతులను నేరుగా తెలుసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. బీసీ కులాల బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలు కులాల ప్రతినిధులు బీసీ కమిషన్ చైర్మన్ కు విన్నవించారు. రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు పరిష్కరించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధా భాయ్, తహసీల్దార్లు విజయ్ ప్రకాష్ రావు, మహేష్ కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు, వివిధ బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కులాల స్థితిగతులు తెలుసుకునేందుకే పర్యటన

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు



**ప్రజానావ, వేములవాడ:** బీసీ కులాలలోని పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మల కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు తాము ఇక్కడికి వచ్చామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి బుధవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ చైర్మెన్ గెస్ట్ హౌస్ ఆవరణలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సోషియో, ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించి, అసెంబ్లీ లో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందని వెల్లడించారు. తమ కులం పేరు విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచు కునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి వారు విజ్ఞప్తులు అందజేశారని వివరించారు. వారి కులాల పేరు మార్పు కోసం ఇప్పటికే ఆయా కులాల ప్రతినిధులతో చర్చించామని తెలిపారు. విజ్ఞప్తులు అందజేసిన వారి స్థితిగతులు నేరుగా తెలుసుకునేందుకు జిల్లా పర్యటనకు తాము వచ్చామని చైర్మెన్ పేర్కొన్నారు. పరిశీలన అనంతరం ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల లోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తామని వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రాజన్నను దర్శించుకున్న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు

ప్రజానావ, సిరిసిల్ల: రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి బుధవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్, సభ్యులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఈఓ వినోద్ ప్రసాదం అందజేశారు. అనంతరం చైర్మన్, సభ్యులను ఆలయ అర్చకులు ఆశీర్వచనం. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ, కరీంనగర్: మానకొండూరు మండలం గంగిపల్లిలోని ఏదుగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి పెద్దపట్నం వేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పట్నాలు వేసి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ తరపున భక్తులకు అన్నదానం చేశారు.





ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# 3 రన్స్‌తో సెంచరీ మిస్సయ్యాడు

**న్యూఢిల్లీ: 2025 ఐపీఎల్‌లో గుజరాత్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ రెచ్చిపోయాడు. 42 బంతుల్లోనే 97 పరుగులతో రఫ్ఫాడించాడు. ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు ఉండగా, ఏకాంగా 9సిక్స్‌లు బాదేశాడు. అయితే ఈ మ్యాచ్?లో అయ్యర్ 17వ ఓవర్‌లోనే 90ల్లోకి చేరుకున్నా, సెంచరీ చేయకపోవడం ఆశ్చర్యం కలిగించింది.**

16ఓవర్ పూర్తయ్యేసరికి అయ్యర్ 66 పరుగులతో ఉన్నాడు. ప్రసిద్ధ్ వేసిన తర్వాతి ఓవర్లో అతడు చెలరేగిపోయాడు. వంసగా 6, 4, 6, 6, 2 బాదేశాడు. దీంతో అయ్యర్ 90 పరుగులకు చేరుకున్నాడు. అప్పటికి ఇంకా 3 ఓవర్లు ఉన్నాయి. దీంతో అయ్యర్ పక్కా సెంచరీ చేసేస్తాడు అనిపించింది. అయితే మరో ఎండ్‌లో ఉన్న శశాంక్ సింగ్ పరుగుల సునామీ సృష్టించాడు. ఎడాపెడా బౌండరీలు బాదేస్తూ ఫుల్ రిథమ్‌లోకి వచ్చేశాడు. దీంతో అయ్యర్‌కు ఎక్కువగా స్ట్రైకింగ్ లభించలేదు. ఆ చివరి రెండు ఓవర్లలో అయ్యర్ ఎదుర్కొంది 2 బంతులే. ఆ రెండు బంతుల్లో 7 పరుగులు బాది 97 వ్యక్తిగత స్కోర్ వద్ద నిలిచిపోయాడు. ఇలా అయ్యర్‌కు ఐపీఎల్‌లో తొలి సెంచరీ చేసే ఛాన్స్ మిస్ అయ్యింది. సెంచరీ మిస్ అయినా, అయ్యర్ నిస్వార్థమైన ప్లేయర్ అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. సొంత రికార్డుల కోసం కాకుండా జట్టు కోసం మాత్రమే ఆడే ప్లేయర్ అని ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే మ్యాచ్ అనంతరం శ్రేయస్ సెంచరీ మిస్ కావడంపై శశాంక్ సింగ్ స్పందించాడు. 16ఓవర్‌లో మార్కస్ స్టాయినిస్ ఔట్ అవ్వడంతో శశాంక్ క్రీజులోకి వచ్చాడు. అయితే చివరి ఓవర్?లో తొలి బంతి నుంచి తన సెంచరీ గురించి ఆలోచించకుండా దూకుడుగా ఆడేయమని తనకు అయ్యర్ చెప్పినట్లు శశాంక్ తెలిపాడు. 'నా సెంచరీ గురించి ఆలోచించకు. నీ గేమ్ నువ్వు ఆడు. నువ్వు షాట్లు ఆడితే నేను సంతోషిస్తా' అని శశాంక్ పేర్కొన్నాడు. కాగా, పంజాబ్ ఈ మ్యాచ్?లో 11 పరుగుల తేడాతో నెగ్గింది.




## జట్టులో చోటు దక్కలేదని తెలిసి ఎంతో బాధపడ్డా

### స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్



న్యూఢిల్లీ: 2025 ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో చోటు దక్కకపోవడంపై స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ తొలిసారి స్పందించాడు. జట్టులో చోటు దక్కలేదని తెలిసి ఎంతో బాధ పడినట్లు పేర్కొన్నాడు. అది జీర్ణించుకోవడం చాలా కష్టం అయ్యిందని తెలిపాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, మేనేజ్‌మెంట్ జట్టుకు ఏది మంచిదో అదే ఆలోచిస్తారని అన్నాడు. మంగళవారం గుజరాత్- పంజాబ్ మ్యాచ్‌కు ముందు సిరాజ్ ఈ కామెంట్స్ చేశాడు. 'ఇంటర్నేషనల్ ప్లేయర్లు అన్ని ఐసీసీ టోర్నమెంట్‌ల్లో ఆడాలని అనుకుంటారు. నేను కూడా అలానే అనుకుంటా. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక కాలేదని తెలిశాక చాలా బాధపడ్డా. అది జీర్ణించుకోలేకపోయాను. కానీ, రోహిత్ భాయ్ జట్టుకు ఏది ఉత్తమమో అదే చేస్తాడు. అతడికి చాలా అనుభవం ఉంది. దుబాయ్ పిచ్‌లపై పేసర్ల ప్రభావం తక్కువగా ఉంటుందని అతడికి తెలుసు. అందుకే కెప్టెన్‌గా స్పిన్నర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. ఏదైతే నేం ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచాం. అది సంతోషం' అని సిరాజ్ అన్నాడు.ఛాంపియన్స్ ట్రోఫీ- ఐపీఎల్ మధ్యలో బ్రేక్ తనకు ప్రాక్టీస్ చేసుకునేందుకు ఉపయోగపడిందని అన్నాడు. 'కొంతకాలంగా నేను బ్రేక్ లేకుండా క్రికెట్ ఆడుతున్నా. అయితే మ్యాచ్‌ల్లో ఆడుతున్నప్పుడు మన తప్పులను తెలుసుకోలేము. అందుకే ఈ బ్రేక్‌ను వాడుకున్నా. ఫిట్‌నెస్, ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టాను' అని పేర్కొన్నాడు. అయితే భారత్ తమ మ్యాచ్‌లు ఆడే దుబాయ్ పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలం అని మేనేజ్‌మెంట్ భావించింది. అందుకే ఈ టోర్నీకి జట్టులో ఐదుగురు స్పిన్నర్లకు చోటు కల్పించింది. దీంతో సిరాజ్‌ను పక్కనపెట్టాల్సి వచ్చిందని రోహత్ అప్పుడే క్లారిటీ ఇచ్చాడు. కాగా, 2023 వన్డే, 2024 టీ20 వరల్డ్‌కప్ టోర్నీల్లో మాత్రం సిరాజ్‌కు చోటు దక్కింది.

## తొలి మ్యాచ్ లో నిరాశ పర్చిన మ్యాక్స్ వెల్





**న్యూఢిల్లీ:** కోట్లాది రూపాయలు పెట్టి కొన్న ఆస్ట్రేలియాకు చెందిన గ్లెన్ మ్యాక్స్ వెల్ తొలి మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ తరపున నిరాశ జనక ప్రదర్శన చేశాడు. గోల్డెన్ డక్ తో అభిమానులను ఉస్సూరుమనిపించాడు. గత సీజన్ లో ఘోరంగా విఫలమై రెప్యుటేషన్ కొల్పోయిన మ్యాక్సీ.. ఈ సీజన్ లో శుభారంభం చేస్తాడనుకుంటే ఫ్లాప్ షో కొనసాగించాడు. సాయి రవికిశోర్ బౌలింగ్ లో తను ఆడిన తొలి బంతినే రివర్స్ స్వీప్ కు ప్రయత్నించి, వికెట్ల ముందు దొరికిపోయాడు. దీంతో గోల్డెన్ డకౌట్ అయ్యాడు. నిజానికి రివ్యూ చేస్తే తను బతికి పోయేవాడే, కానీ శ్రేయస్ సూచన్ తో నేరుగా పెవిలియన్ వైపు వెళ్లిపోయాడు. దీంతో ఐపీఎల్లో ఒక చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. టోర్నీలో అత్యధిక సార్లు డకౌట్ అయిన ప్లేయర్ గా నిలిచాడు. 130 ఇన్నింగ్స్ ఆడిన మ్యాడ్ మ్యాక్స్.. తాజాది కలిపి 19వ సారి డకౌట్ అయ్యాడు. దీంతో ఈ లిస్టులో అందరికంటే ముందు నిలిచాడు. భారత స్టార్ రోహిత్ శర్మ (234 ఇన్నింగ్స్ లో 18), దినేశ్ కార్తీక్ (253 ఇన్నింగ్స్ లో 18), పీయూష్ చావ్లా (92 ఇన్నింగ్స్ లో 16), సునీల్ నరైన్ (111 ఇన్నింగ్స్ లో 16) తర్వాతి స్థానాల్లో నిలిచారు. గతంతో విధ్వంసకరంగా ఆడుతాడని పదుల కోట్లలో తనను కొనుగోలు చేసిన ఫ్రాంచైజీలు.. 2024 సీజన్ ఫ్లాఫ్ షోతో అంతగా తనపై ఆసక్తి చూపించలేదు. దీంతో పంజాబ్ 4.2 కోట్లతో మ్యాక్సీని సొంతం చేసుకుంది. గతంలో కూడా పంజాబ్ తరపున మ్యాక్సీ ఆడాడు. మంగళవారం జరిగిన మ్యాచ్ లో ఆతిథ్య గుజరాత్ జెయింట్స్ పై పంజాబ్ కింగ్స్ 11 పరుగులతో విజయం సాధించింది. అయితే ఈ మ్యాచ్ చివరి దశలో ఇంపాక్ట్ ప్లేయర్ గా బరిలోకి దిగిన బౌలర్ విజయ్ కుమార్ వైశాక్ మ్యాచ్ ను పూర్తిగా టర్న్ చేశాడు. ఆఫ్ సైడ్ వైడ్ యార్కర్ ను టార్గెట్ చేసుకుని పదే పదే బంతులు విసురుతూ, గుజరాత్ బ్యాటర్లను అసహనానికి గురి చేశాడు. దీంతో పరుగుల రాక మందగించడంతో పంజాబ్ మ్యాచ్ లోకి వచ్చింది. తను వేసిన ఫస్ట్ రెండు ఓవర్లలో కేవలం 10 పరుగులు మాత్రమే ఇచ్చి సత్తా చాటాడు. దీంతో ఓడిపోతుందనుకున్న పంజాబ్ మ్యాచ్ ను గెలిచింది. టోర్నీలో చాలాకాలం నుంచి ఆడుతున్నప్పటికీ, సెంచరీ చేయలేదు. 17వ ఓవర్లోనే 90లోకి ప్రవేశించిన శ్రేయస్.. నిస్వార్థపూరిత బ్యాటింగ్ తో జట్టు గెలుపునకు కృషి చేశాడు. అతను కనుక సెంచరీ కోసం చూసి, కొన్ని బంతులు వేస్ట్ చేసినట్లయితే, పంజాబ్ 243 పరుగులు చేసి ఉండకపోయేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తన తొలి ఐపీఎల్ సెంచరీని జట్టు కోసం త్యాగం చేసి శ్రేయస్ ను పొగుడుతున్నారు. ఏదేమైనా శ్రేయస్ నిజమైన కెప్టెన్స్ ఇన్నింగ్స్ ఆడాడని ప్రశంసిస్తున్నారు. ఈ విజయంతో ఈ సీజన్ లో వరుసగా నమోదైన మూడు ఆతిథ్య జట్ల విజయాల పరంపరకు బ్రేక్ వేసింది. పర్యాటక జట్టుగా గుజరాత్ లో ఆడిన పంజాబ్.. అక్కడ విజయం సాధించింది.




## పాకిస్థాన్ మరోసారి చెత్త ప్రదర్శన..

### న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో గెలుపు

**వెల్లింగ్టన్:** పాకిస్తాన్ క్రికెట్ జట్టు న్యూజిలాండ్ పర్యటనలో ఉంది. టీ20 సిరీస్ కోసం న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న పాకిస్థాన్ జట్టు చెత్త ప్రదర్శనలను కొనసాగిస్తోంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో.. ఐదు మ్యాచ్‌లలో ఒక్క మ్యాచ్‌లో మాత్రమే మెరుగైన ప్రదర్శన చేసింది. మిగతా మ్యాచ్‌లలో గల్లీ జట్ల కంటే ఘోరంగా ఆడిన పాకిస్థాన్ జట్టు మరోసారి తమ చెత్త ప్రదర్శనలను రిపీట్ చేసింది. ఈ సిరీస్ లోని ఐదో మ్యాచ్ నేడు వెల్లింగ్‌టన్ లోని స్కై స్టేడియం వేదికగా జరిగింది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ దారుణమైన ఓటమిని ఎదుర్కొంది. ఈ మ్యాచ్‌లో కివీస్ జట్టు ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి గొప్ప విజయాన్ని సాధించారు. ఈ మ్యాచ్ లో న్యూజిలాండ్ పాకిస్థాన్ ను ఓడించి సిరీస్‌ను 4-1 తేడాతో గెలుచుకుంది. న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్ లో పాకిస్థాన్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఐదు కీలక మార్పులు చేసింది. దీని తర్వాత కూడా పాకిస్థాన్ ఈ మ్యాచ్ లో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. పాకిస్థాన్ జట్టుకు మ్యాచ్ ప్రారంభం ముందే మంచి ఆరంభం లభించలేదు. ఎందుకంటే ఓపెనర్ హసన్ నవాజ్ 3 బంతుల్లో డకౌట్ గా వెనుదిరగగా.. మహ్మద్ హారిస్ 17 బంతుల్లో 11 పరుగులు చేసి ఔటయ్యాడు. దీని తర్వాత మూడో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన ఉమెర్ యూసుఫ్ కూడా నిరాశపరిచాడు. అతను 7 పరుగులు చేశాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేసిన కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా 39 బంతుల్లో పరుగులు చేసి ఇన్నింగ్స్ ఆడాడు. ఇది కాకుండా షాదాబా ఖాన్ 20 బంతుల్లో 28 పరుగులు చేశాడు. 129 పరుగుల సులభమైన లక్ష్యాన్ని న్యూజిలాండ్ జట్టు అలవోకగా ఛేదించింది. న్యూజిలాండ్ ఆటగాళ్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ 38 బంతుల్లో 97 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 6 ఫోర్లు, 19 సిక్సర్లు ఉన్నాయి. అదే సమయంలో ఫిన్ అలెన్ 12 బంతుల్లో 27 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. న్యూజిలాండ్ కేవలం 10 ఓవర్లరోనే లక్ష్యాన్ని చేరుకుంది. 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ మ్యాచ్ ను గెలుచుకుంది. ఈ 5 మ్యాచ్ ల సిరీస్ లో పాకిస్థాన్ రెండో టీ20లో మాత్రమే గెలిచింది. మిగిలిన 4 మ్యాచ్ లలో పాకిస్థాన్ కు నిరాశ ఎదురైంది. న్యూజిలాండ్ విజయంలో క్రెడిట్ జేమ్స్ నీషమ్ కు దక్కుతుంది. ఎందుకంటే జేమ్స్ నీషమ్ ఈ మ్యాచ్ లో తన అద్భుతమైన బౌలింగ్ తో అదరగొట్టాడు. తాను వేసిన 4 ఓవర్లలో 22 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అతనితో పాటు జాకబ్ డఫీ 2 వికెట్లు పడగొట్టాడు. పాకిస్థాన్ తరఫున సూఫియా ముఖీమ్ రెండు వికెట్లను పడగొట్టాడు.



## ద్రవిడ్ లాగా గంభీర్ ఆ డబ్బును వెనక్కి ఇచ్చేస్తాడా?

### సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు

ముంబై: ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న భారత జట్టుకు బీసీసీఐ రూ.58 కోట్ల నగదు బహుమతిని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆటగాళ్లు, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు చెరో రూ.3 కోట్లు లభిస్తాయి. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రకారం.. అసిస్టెంట్ కోచ్‌లు, సహాయక సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.50 లక్షలు, బీసీసీఐ అధికారులకు రూ.25 లక్షలు అందుతాయి. అయితే టీ20 ప్రపంచకప్ 2024 గెలిచినప్పుడు అప్పటి ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తన ప్రైజ్ మనీని వెనక్కి ఇచ్చి సహచరులకు సమంగా పంచాలని కోరారు. ఈ అంశంపై స్పందించిన సునీల్ గవాస్కర్.. మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ లాగా గౌతమ్ గంభీర్ తన సపోర్టు స్టాఫ్ కు పంచమని డబ్బులు తిరిగి వెనక్కి ఇచ్చేస్తాడా? అని ప్రశ్నించారు. 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం ద్రవిడ్ తన మిగిలిన సహాయక సిబ్బందితో సమానమైన నగదు బహుమతిని తీసుకున్నాడు. అయితే గంభీర్ ఇంకా అలాంటి ప్రకటన చేయలేదు. "టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం టీమిండియాకు బీసీసీఐ నగదు బహుమతిని ప్రకటించింది. అప్పుడు భారత జట్టుకు ప్రధాన కోచ్ గా ఉన్న రాహుల్ ద్రవిడ్ కు ఇతర సిబ్బందితో పోలిస్తే భారీ రివార్డును ప్రకటించింది. కానీ ద్రవిడ్ ఆ మెత్తాన్ని వెనక్కి ఇచ్చేసి సహచరులకు సమానంగా పంచమన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేతగా టీమిండియా నిలిచిన తర్వాత కూడా బీసీసీఐ రివార్డును ప్రకటించింది. నగదు బహుమతులను ప్రకటించి పక్షం రోజులు అయింది. ప్రస్తుత కోచ్ గౌతమ్ గంభీర్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ఈ విషయంలో ద్రవిడ్ మంచి రోల్ మోడల్ కాదా?" అంటు సునీల్ గవాస్కర్ స్పోర్ట్ స్టార్ కోసం కాలంలో ఇలా రాసుకొచ్చారు. ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్నందుకు క్రికెటర్లకు బహుమతులు ఇచ్చినందుకు గవాస్కర్ బీసీసీఐని ప్రశంసించారు. " భారత ఆటగాళ్లు ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న తర్వాత టీమిండియాకు, సహాయక సిబ్బంది, సెలక్షన్ కమిటీకి బీసీసీఐ రూ. 58 కోట్ల రూపాయల భారీ విరాళాన్ని ప్రకటించింది. గతేడాది జులైలో ఐసీసీ టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత జట్టు, సహాయక సిబ్బంది, సెలెక్టర్లకు రూ.125 కోట్లు ప్రకటించింది. ఆటగాళ్లు సాధించిన విజయాలను అభినందిస్తూ నజరానా ప్రకటించడం అభినందనీయం. ఉదారంగా బహుమతులు ఇవ్వడం అద్భుతం. విజేతల కోసం ఐసీసీ ప్రకటించిన ప్రైజ్ మనీని ఆటగాళ్లు ఉంచుకోవడానికి బీసీసీఐ అనుమతిస్తోంది. ఇలా చేయడం వల్ల ప్రతి ఒక్కరికీ భారీ మొత్తం లభిస్తోంది."అని సునీల్ గవాస్కర్ పేర్కొన్నారు.

## డబ్బులుంటే క్రికెట్ మానేస్తా

### గ్లెన్ ఫిలిప్స్ కీలక వ్యాఖ్యలు

**వెల్లింగ్టన్:** పక్షిలా గాల్లోకి ఎగురుతూ క్యాచ్‌లు పట్టడం.. పాదరసంలా కదులుతూ ఫీల్డింగ్ విన్యాసాలు చేయడం అంటే ప్రస్తుత క్రికెట్ లో గుర్తొచ్చే పేరు గ్లెన్ ఫిలిప్స్. అతడు డైవ్‌లు చేస్తూ క్యాచ్‌లు పట్టేస్తుంటే ప్రేక్షకులను మతి పోతుంటుంది. అయితే తాజాగా అతడు తాను క్రికెటర్ కాకపోయి ఉంటే ఏం అయ్యేవాడో వివరించాడు. ఇంకా క్రికెట్ లో రిటైర్మెంట్ అయ్యాక తానేం చేయాలనుకుంటున్నాడో తెలిపాడు. మైదానంలో ఫీల్డింగ్ చేసేటప్పుడు గాల్లోకి ఎగిరి ఎలా అయితే క్యాచులు పట్టడం ఎలా అయితే ఇష్టమో.. నిజజీవితంలోనూ గాల్లోకి ఎగరడమంటే బాగా ఇష్టమని చెప్పాడు ఫిలిప్స్. "గాల్లో ఎగరడం, ప్రయాణించడమంటే చాలా ఇష్టం. ఒకవేళ నేను క్రికెట్ ఆడకపోయి ఉంటే, అలానే ప్రపంచంలోని డబ్బంతా నా దగ్గర ఉంటే, నా జీవితంలో నేను పైలెట్ అయ్యేవాడిని. నా జీవితాన్ని కూడా పైలెట్ తోనే ముగించేవాడిని. నాకు గాల్లో ఉండటమంటే చాలా ఇష్టం." అని అన్నాడు. "పైలట్ గా ఉండటానికి సంబంధించిన విధానాలు, రేడియో కమ్యూనికేషన్స్ సహా అతడి చుట్టు ఉండే వాతావరణం అన్నీ బాగా ఇష్టపడతాను. ముఖ్యంగా విమానాన్ని హ్యాండిల్ చేయడాన్ని బాగా ఆస్వాదిస్తాను. నిజంగా నాకు తెలీదు మరి అది అంటే అంత ఎందుకు ఇష్టమో. నేనే కాదు విమానాన్ని ప్రేమించే వారు ఎవరైనా సరైన కారణం చెప్పలేరు. అయినా విమానంలో ప్రయాణించడం, ఎగరడం అనేది మనుషులు ఎప్పటి నుంచో కోరుకున్న అనుభూతే. కాబట్టి, నేను కూడా దానిని అతీతుడిని ఏమీ కాదని భావిస్తున్నాను. " అని వెల్లడించాడు. తాను క్రికెట్ లో రిటైర్మెంట్ అయ్యే సమయానికి కావాల్సినంత డబ్బు సంపాదించలేకపోతే, పైలెట్ గా మారుతానని చెప్పాడు ఫిలిప్స్. "క్రికెట్ తర్వాత నేను ఏదైనా నచ్చిన పని చేస్తూ ఆనందంగా గడపాలనే కోరిక ఉంది. అందులో పైలెట్ కూడా ఒకటి. అసలు క్రికెట్ తర్వాత కూడా ఏదైనా పని చేయాల్సి వస్తే అది పైలెట్ గా మాత్రమే చేసేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తాను. లేదంటే ఏ పనిపై పై ఆధారపడకుండా పర్వత ప్రాంతాల్లో సమయం గడపగలిగితే అది నాకు అందమైన జీవనం అవుతుంది." అని పేర్కొన్నాడు. ఇకపోతే గాల్లోకి ఎగిరి క్యాచులు పట్టడం తనకు సహజంగా వచ్చిన ప్రతిభ అని చెప్పాడు ఫిలిప్స్. అలానే తాను సాధన చేస్తూ శ్రమిస్తానని కూడా చెప్పాడు.



# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

8 గురువారం 27 మార్చి 2025





## ఓటీటీలో దుమ్మురేపుతున్న గేమ్‌ఛేంజర్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం గేమ్ ఛేంజర్. దిగ్గజ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌ను అందుకుంది. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా కావడంతో మెగా అభిమానులు భారీ నమ్మకం పెట్టుకున్నారు. అయితే శంకర్ అదే పాత స్టోరీతో ప్రేక్షకుల ముందు రావడంతో భారీ నష్టాన్ని చవి చూసింది. రూ.450 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రాగా దాదాపు రూ.150 కోట్ల నష్టం వచ్చినట్లు సమాచారం. అయితే ఈ సినిమా ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తాజాగా ఈ మూవీ హిందీ వెర్షన్‌ని జీ5 ఓటీటీ వేదిక మార్చి 07న విడుదల చేసింది. హిందీ వెర్షన్ ఓటీటీలోకి వచ్చిన తొలిరోజు నుంచే ఈ సినిమా టాప్ టెన్‌లో దూసుకుపోతుంది. ఈ చిత్రం హిందీలో ఇప్పటివరకూ 250 మిలియన్ మినిట్స్‌కు పైగా వ్యూస్ సాధించినట్లు జీ5 ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రామ్‌నందన్ (రామ్‌చరణ్) విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకుంటాడు. ఇదే సమయంలో అభ్యుదయ పార్టీ నాయకుడు, ముఖ్యమంత్రి సత్యమూర్తి (శ్రీకాంత్) పదవీకాలం మరో ఏడాదిలో ముగుస్తుంది. సత్యమూర్తి కొడుకు బొబ్బిలి మోపిదేవి (ఎస్.జె.సూర్య) ముఖ్యమంత్రి కుర్చీపై కన్నేస్తాడు. తండ్రిని అడ్డుతొలగించి పదవి కోసం ఓ పన్నాగం పన్నుతాడు. సరిగ్గా ఇదే సమయంలో రామ్‌నందన్‌కు సంబంధించిన ఓ రహస్యం బయటపడుతుంది. ఏమిటా రహస్యం..? రామ్‌నందన్‌కు సత్యమూర్తికి వున్న అనుబంధం ఏమిటి..? ఈ కథలో అప్పన్న (రామ్‌చరణ్) ఎవరు? ముఖ్యమంత్రి కుర్చీ కోసం మోపిదేవి చేసిన కుట్రలని రామ్‌నందన్ ఎలా తిప్పికొట్టాడు? ఇవన్నీ తెరపై చూడాలి.



## జపాన్‌లో దేవర

### సెలబ్రేషన్స్‌లో ఎన్టీఆర్ సందడి

జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం దేవర. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ మూవీ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 గతేడాది సెప్టెంబర్ 27న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై సూపర్ హిట్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా దాదాపు రూ.500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఇదే సినిమాను జపాన్‌లో విడుదల చేస్తున్నారు మేకర్స్. ఎన్టీఆర్ గత చిత్రాలకు జపాన్‌లో మంచి క్రేజ్ ఉందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే అక్కడ విడుదలైన బాద్‌షాతో పాటు ఆర్ఆర్ఆర్ చిత్రాలు మంచి కలెక్షన్లు సాధించాయి. ఈ నేపథ్యంలోనే దేవర సినిమాను జపాన్‌లో మార్చి 28న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా జపాన్‌కి వెళ్లిన ఎన్టీఆర్ దర్శకుడు కొరటాల శివ.. జపాన్ అభిమానులను కలవడంతో పాటు అక్కడి స్థానిక మీడియాలలో దేవర ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు. అయితే జపాన్ ప్రజల ప్రేమకు ఫిదా అయిన తారక్ తాజాగా వారితో ఉన్న ఒక వీడియోను ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. మీ ప్రేమతో నా మనసు నిండిపోయింది. జపనీస్ ప్రేక్షకులు మార్చి 28 నుండి సినిమా హాళ్లలో "దేవర"ని అనుభవించడానికి నేను వేచి ఉండలేను అంటూ రాసుకొచ్చాడు.



## ఒక్క ఏడాదిలో భాగ్యశ్రీ బోర్సే మూడు సినిమాలు

మాస్ మాహారాజా రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. కానీ ఈ బ్యూటీ మాత్రం స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. తెలుగులో చేసిన ఒక్క సినిమా నిరాశపరిచింది కానీ... ఈ అమ్మడు స్పీడ్ మాత్రం మాములుగా లేదు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ చూస్తుండగానే స్టార్ బ్యూటీలను వెనక్కు నెట్టేస్తోంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అవుతోంది ఈ బ్యూటీ. ఫస్ట్ సినిమాతోనే యాక్టింగ్, గ్లామర్ పరంగా మంచి మార్కులే కొట్టేసిన ఈ వయ్యారి.. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ సరసన కాంత సినిమాలో నటిస్తుంది. అలాగే విజయ్ దేవరకొండ జోడిగా కింగ్ డమ్ మూవీ చేస్తుంది. ఇవే కాకుండా తెలుగులో మరిన్ని ఆఫర్స్ కొట్టేసింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనితో కలిసి కొత్త ప్రాజెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ ఏడాదిలోనే ఏకంగా మూడు సినిమాలో అడియన్స్ ముందుకు రానుంది ఈ వ్యయారి. కింగ్ డమ్ సినిమాలో మేలో రిలీజ్ కానుంది. రామ్ పోతినేనితో చేస్తోన్న సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే నటిస్తోన్న కాంత మూవీ ఈ ఏడాది చివర్లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే మూడు సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనుంది.



## ఆ అందానికి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే..!

యంగ్ బ్యూటీ శ్రీలీల గురించి ఎంత చెప్పినా తక్కవే. ఈ నటి తన అందంతో ఎంతో మంది మదిని దోచింది. పెళ్లిసందడి సినిమాతో తెలుగు వెండితెరపైకి అడుగు పెట్టి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. అంతే కాకుండా మొదటి సినిమాతోనే మంచి ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది ఈ నటి. ఈ మూవీ తర్వాత శ్రీలీలకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. ముఖ్యంగా రవితేజ ధమాక సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ సినిమాలో ఈ అమ్మడు డ్యాన్స్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ఇక ఈ సినిమా తర్వాత శ్రీలీల గుంటూరు కారం, స్కంద, భగవంత్ కేసరి, ఎక్స్ టాఆర్డినరీ బ్యాన్ ఇలా వరస సినిమాలు చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు అదృష్టం మాత్రం కలిసి రాలేదనే చెప్పాలి. వరసగా ఆఫర్స్ వచ్చినా అవి బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అవ్వడంతో ఒక్కసారిగా శ్రీలీల క్రేజ్ తగ్గిపోయింది. దీంతో అవకాశాలు కూడా అంతగా లేకపోవడంతో ఈ అమ్మడు కాస్త సైలెంట్ అయ్యింది. పుష్ప 2 సినిమాలో కిసక్కీ అంటూ తన డ్యాన్స్ గ్లామర్‌తో తెలుగు అభిమానులను పలకరించిన శ్రీలీల మరోసారి రాబిన్ హుడ్ మూవీ ద్వారా థియేటర్లో సందడి చేయడానికి రెడీ అయిపోయింది. అయితే తాజాగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న శ్రీలీల స్కైబ్లూ కలర్ చీరలో కనిపించి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ శారీలో ఈ ముద్దుగుమ్మ అందాలను చూస్తే ఎవ్వరైనా సరే ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన గ్లామర్‌తో ఆకట్టుకుంది కిసక్కీ బ్యూటీ. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఫొటోస్ చూసిన నెటిజన్స్ నీలిరంగు చీరలో చందమామలా చాలా అందంగా ఉన్నావంటూ


Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**